Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 123 | హైదరాబాద్ | బుధవారం 25 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## పట్టు వీడని విక్రమార్కుడు..

### అధిష్ఠానం బుజ్జగించినా.. రాజీనామా బాట

జనం మెచ్చిన జనహృదయ నేతగా జీవన్ రెడ్డి

నేడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

(గుండేటి రాజు, ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్- మార్చి 24)

75 సంవత్సరాల వయసు ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డికి అలుపెరుగలేదు. పేదల సంక్షేమం కోసం అనునిత్యం పాటు పడే జీవన్ రెడ్డి నేడు తన ఆత్మ గౌరవాన్ని చంపుకుని కాంగ్రెస్ పార్టీకి

- మిగతా 2వ పేజీలో

# మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్లే!

హిందూ, సిక్కు, బౌద్ధం మినహా ఇతర మతాలకు మారితే ఎస్సీ రిజర్వేషన్ వర్తించదు

క్రైస్తవాన్ని స్వీకరించిన వారు దళిత హోదాను పొందలేరు

ఎస్సీ, ఎస్టీ ఆకృత్యాల నిరోధక చట్టం కింద వారికి రక్షణ లభించదు

ఏపీ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, మార్చి 24 (ప్రజాతీర్పు)

హిందూ, బౌద్ధం, సిక్కు మతాలు మినహా ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు తమ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను తక్షణమే కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. క్రైస్తవ మతాన్ని స్వీకరించి, ఆచరిస్తున్న వ్యక్తులు దళిత హోదాను క్లెయిమ్ చేయలేరని, అలాగే తమకు రక్షణ కల్పించాలంటూ 'ఎస్సీ, ఎస్టీ ఆకృత్యాల నిరోధక చట్టాన్ని' (అట్రాసిటీ చట్టం) ఏమాత్రం ఆశ్రయించలేరని తేల్చిచెప్పింది. ఏపీలోని పిట్టలవానిపాలెం గ్రామంలో హిందూ మతం నుంచి క్రైస్తవంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్న చింతాడ ఆనంద్ అనే వ్యక్తి తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ పలువురిపై పెట్టిన అట్రాసిటీ కేసును కొట్టేస్తూ ఏపీ హైకోర్టు గతేడాది ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. ఏపీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేవలం ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు రద్దు చేయనంత మాత్రాన.. మతం మారిన వాస్తవాన్ని విస్మరించలేమని, అతనికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందే అర్హత రాదని తేల్చిచెప్పింది. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఉదహరించింది. 'ఈ కేసులో పిటిషనర్ తిరిగి తన మాతృ మతంలోకి (హిందూ) మారినట్లు గానీ, మాదిగ సామాజికవర్గం అతన్ని తిరిగి తమలోకి చేర్చుకున్నట్లు గానీ ఎటువంటి ఆధారాలు లేవు. పైగా అతను దశాబ్దానికిపైగా క్రైస్తవాన్ని ఆచరిస్తున్నాడు. పాస్టర్‌గా సేవలందిస్తూ గ్రామాల్లో ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్నాడు. దాడి జరిగినట్లు చెబుతున్న రోజున కూడా అతను ఇంట్లో ప్రార్థనలు నిర్వహించాడు. ఈ వాస్తవాలన్నీ ఘటన జరిగిన నాటికి అతను క్రైస్తవుడేనని నిస్సందేహంగా నిరూపిస్తున్నాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



## మాది ప్రజా సంక్షేమ బడ్జెట్

ఈ ఏడాది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ యువశక్తి పథకాలు అమలు చేస్తాం

భారాసకు శాసనసభ, ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు

శాసనసభ, మండలిలో బడ్జెట్‌పై సమాధానమిచ్చిన డిప్యూటీ సీఎం

- 2లో

### 50 శాతం సీట్ల పెంపు

# ముమ్మాటికీ కుట్రే

## కేంద్రం నిర్ణయంతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం



ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఎంతుందో అదేస్థాయిలో సీట్ల పెంపు జరగాలి. మొత్తం స్థానాలను 815కు పెంచితే అందులో నుంచి 195 తీసివేస్తే.. మమ్మల్ని అడిగేవారే ఉండరు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక సీట్లు అవసరం. భవిష్యత్తులో ఆ అవసరమే ఉండదు.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ అంశంపై రాష్ట్రాలు కలిసి పోరాడాల్సిందే

యూపీలో 50% సీట్లు పెరిగితే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది అవసరమే ఉండదు

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ కలవడం ఖాయం

ఓ టీవీ చానల్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 24 (ప్రజాతీర్పు)

లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అతి పెద్ద కుట్రగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండానే సీట్లను పెంచాలనే అభిప్రాయం స్వార్థ రాజకీయ ఎత్తుగడలో భాగమే అని విమర్శించారు. 'ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఎంతుందో అదేస్థాయిలో సీట్ల పెంపు జరగాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం, వివక్ష చూపుతోంది. ఈ విషయంపై దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలో, జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుంది. జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. ఈ విషయమై అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకెళ్లాలి' అని రేవంత్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఓ టీవీ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే... తమిళనాడు, పుదుచ్చేరిలో కలిపి 40, ఉత్తరప్రదేశ్‌లో 80 స్థానాలున్నాయి. 40–80లో 40 తేడా ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 80 స్థానాలు 120కి

- మిగతా 2వ పేజీలో



## సంక్షోభం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

ప్రజలకు ప్రధాని మోడీ సూచన

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకోవాలి

న్యూఢిల్లీ బ్యూరో: పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో దేశం కోవిడ్ కాలం నాటి సంక్షోభం వంటి దీర్ఘకాలిక సంక్షోభం వైపు పయనిస్తోందని, దానిని ఎదుర్కొనేందుకు పౌరులు సంపూర్ణంగా సిద్ధంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. దేశంలోని ఘర్షణల వల్ల ఏర్పడిన సంక్షోభం గురించి మంగళవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. 'ఇంధన సరఫరా గొలుసులలో అంతరాయం, ధరల పెరుగుదల సుదూర పరిణామాలకు దారి తీస్తాయి. యుద్ధం వల్ల కలిగే సంక్షోభం దీర్ఘకాలం కొనసాగుతుంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. కోవిడ్–19 సంక్షోభాన్ని అధిగమించడానికి ఉన్నత స్థాయి బృందాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా, యుద్ధకాల సంక్షోభాన్ని పరిష్కరించడానికి

- మిగతా 2వ పేజీలో



## మోడీకి ట్రంప్ ఫోన్!

పశ్చిమాసియా పరిస్థితులపై చర్చలు

హోర్ముజ్‌ను తెరిచి వుంచాలన్న నేతలు

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేసి పశ్చిమాసియాలో పరిస్థితులపై చర్చించారు. హోర్ముజ్ జలసంధిని తెరిచి వుంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ట్రంప్‌తో మాట్లాడిన అనంతరం మోడీ స్పందిస్తూ, పశ్చిమాసియాలో తక్షణమే ఉద్రిక్తతలు తగ్గాలని భారత్ కోరుకుంటోందని తెలియజేసినట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తెరిచి వుంచుతూ, సురక్షితంగా అన్ని నౌకలకూ అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పినట్లు తెలిపారు. హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్‌కు ఐదు రోజులు గడువిస్తున్నామంటూ వాషింగ్టన్ ప్రకటించిన మరుసటి రోజు నేతల మధ్య ఈ ఫోన్ కాల్ చోటు చేసుకుంది. ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చిందని, పశ్చిమాసియాలో పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సాధ్యమైనంత త్వరలో అక్కడ శాంతి నెలకొనాలని భారత్ కోరుకుంటోందన్నారు. ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకోవాలని భావించారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో మోడీ మాట్లాడిన రోజుల వ్యవధిలోనే ట్రంప్ కాల్ వచ్చింది.



- 2లో

# ఐనా... ఆగని దాడులు!

ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర బాంబుల వర్షం కనిపించని ట్రంప్ 'విరామ' ప్రభావం

రెండు ఇంధన వ్యవస్థలకు భారీ నష్టం: ఇరాన్.. బాంబుల మోతతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్

టెల్ అవీవ్‌పై భారీ దాడులకు దిగిన ఇరాన్.. బహ్రెయిన్‌పై డ్రోన్ దాడుల్లో సైనికుని మృతి

యూఏఈలో ఒక కాంట్రాక్టర్ మరణం.. గంటల తరబడి చీకట్లో మగ్గిన కువైట్



- 2లో

## తప్పుడు చార్జిషీటుతో అక్రమ కేసు

ఫార్ములా–ఈ రేస్ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే..

పునర్విభజన చట్టం ప్రకారం పునర్విభజన జరగాలి

టీడీఆర్ కొనుగోలుతో రేవంత్ కుటుంబం భారీ స్కామ్

# తప్పుడు చార్జిషీటుతో అక్రమ కేసు

హైదరాబాద్: ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై అసెంబ్లీలో బీఆర్ఎస్ తెస్తున్న ప్రైవేటు మెంబర్ బిల్లు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చార్జిషీటు పేరిట మళ్లీ తెరపైకి ఫార్ములా–ఈ తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చేసిన తొలి సంతకానికి సంబంధించిన ఫైలు దొరకడం లేదనే విషయాన్ని బీఆర్ఎస్ బయటపెట్టడంతో సర్కారు ఇరకాటంలో పడిందన్నారు. గతంలో తాను చెప్పినట్టు ఫార్ములా–ఈ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసు అని చెప్పారు. శాసనసభ లాబీల్లోని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చాంబర్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఫార్ములా–ఈ అంశాన్ని గోరంతను కొండంతగా చూపే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోంది. ఇక్కడి నుంచి పంపిన నిధులు రూ.45 కోట్లు అయితే రూ.600 కోట్లకు పైగా ఉన్నాయని తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. తెలంగాణ నుంచి పంపిన రూ.45 కోట్లు ఫార్ములా––ఈ బ్యాంకు ఖాతాలో భద్రంగా ఉన్నాయి. ఆ నిధులను ప్రభుత్వం ఎందుకు వెనక్కి రప్పించడం లేదు. ఈ కేసులో అనుచిత లబ్ధి జరిగిందని చెబుతున్న వారి పేరు చార్జిషీటులో లేదు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'అందాల పోటీల వల్ల తెలంగాణకు పైసా ప్రయోజనం లేకపోగా తనను లైంగికంగా వేధించారని మిస్ యూకే చేసిన ఆరోపణలతో రాష్ట్రం అంతర్జాతీయంగా అప్రతిష్టపాలైంది. ఇంత దారుణం జరిగినా ఒక్క కాంగ్రెస్ నాయకుడిపైనా కేసు నమోదు కాలేదు. సీఎం సరదా కోసం రూ.100 కోట్లతో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించి సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేసినా కేసు నమోదు కాలేదు. ఫార్ములా––ఈ కేసు న్యాయస్థానాల్లో నిలబడదు. ప్రభుత్వం దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేసినా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను వదిలిపెట్టేది లేదు'అని కేటీఆర్ చెప్పారు.

### మూసీపై ప్రణాళిక లేకుండానే..

'రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూపాయి లేకున్నా ఏడీబీ అప్పు ఇస్తుందనే ఉద్దేశంతో డీపీఆర్ లేకుండానే మూసీ అభివృద్ధి ప్రణాళిక చేపడుతోంది. మూసీ ప్రాజెక్టుపై ఫైవ్ స్టార్ హోటళ్లలో కాకుండా మూసీ బాధితులతో చర్చించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు మేధా పాట్కర్ వంటి మేధావులు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నారు'అని కేటీఆర్ అన్నారు. '2014 నాటి రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే స్వాగతిస్తాం. జనాభా ప్రాతిపదికన కాకుండా 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతమున్న నిష్పత్తిలో పునర్విభజన జరగాలి. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి 24శాతం ప్రాతినిధ్యం ఉంది. అదే నిష్పత్తిలో దక్షిణాదికి నష్టం జరగకుండా కేంద్రం చూడాలి. అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుదల ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుంది. అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా, వాటి గొంతు కోయకుండా డీలిమిటేషన్ చేస్తే స్వాగతిస్తాం'అని కేటీఆర్ పేర్కొన్నారు.

### టీడీఆర్ స్కామ్

"ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) పేరిట రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు కచ్చితంగా టీడీఆర్‌లు కొనుగోలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తెచ్చింది. మా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ కుంభకోణంపై విచారణ జరిపిస్తాం. నిర్వాసితుల నుంచి అతి తక్కువ ధరకు టీడీఆర్ కొనుగోలు చేసి వాటిని అడ్డగోలు ధరలకు తిరిగి అమ్ముకుంటున్న రేవంత్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పాత్రను బయటపెడతాం. రేవంత్ పాలనలో టీడీఆర్ అంటే 'తిరుపతి రెడ్డి డెవలప్‌మెంట్ రైట్స్'గా మారిపోయాయి. త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రేవంత్ కుటుంబం టీడీఆర్‌లను ఏటీఎంగా మార్చుకున్న తీరును బయటపెడతాం'అని కేటీఆర్ చెప్పారు.

## 50 శాతం సీట్ల పెంపు ముమ్మాటికీ కుట్రే

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతాయి. ప్రతి చోటా 50 శాతం ఇస్తున్నారని అనుకుంటున్నారు. కానీ.. ఏ లెక్కతో ఇస్తున్నారు. మన దగ్గర వ్యత్యాసం పెంచుతున్నారు. యూపీ, తమిళనాడు మధ్య తేడా 40 ఉంది. ముందు ముందు ఇది 60కి పెరుగుతుంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, బిహార్ ఇలా నాలుగైదు రాష్ట్రాల సీట్లు పెరిగిన తర్వాత అక్కడి నుంచే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చు. తెలంగాణ, ఏపీ కలుపుకొని దక్షిణాది రాష్ట్రాల సీట్లు మొత్తం 130 అవుతాయి. 50 శాతం సీట్లు పెరిగితే అవి 195 అవుతాయి. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు 50 శాతం పెరిగితే దక్షిణాది సీటు ఒక్కటి కూడా అవసరం లేదు. మొత్తం స్థానాలను 815కు పెంచితే అందులో నుంచి 195 తీసివేస్తే.. మమ్మల్ని అడిగేవారే ఉండరు. ఇప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక సీట్లు అవసరం. భవిష్యత్తులో ఆ అవసరమే ఉండదు.

### మోదీ త్రీడీ పాలనకు వ్యతిరేకంగా పోరాటం

ప్రధాని మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణ భారతాన్ని ఏకతాటిపైకి తేవాల్సిన అవసరం ఉంది. డీలిమిటేషన్, డివల్యూషన్, ఈ త్రీడీ విధానంలో ప్రభుత్వాన్ని మోదీ నడపాలనుకుంటున్నారు. దీనికి వ్యతిరేకంగా మేము పోరాడాలనుకుంటున్నాం. గతంలో దక్షిణాదికి రాజకీయాల్లో ప్రాముఖ్యత ఉండేది. దక్షిణాదికి చెందిన కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఏపీ, కర్ణాటకల నుంచి ఒక్క నిర్మలా సీతారామన్ మినహా మంత్రివర్గంలో చోటు లేదు. ప్రధాని, రక్షణ, హోంశాఖ, పరిశ్రమలు, కామర్స్ వంటి టాప్ టెన్ పోర్ట్‌ఫోలియోల్లో మనకు ఏమీ దక్కలేదు. రాజకీయ ప్రాధాన్యంలో దక్షిణాదికి చాలా నష్టం జరుగుతోంది. వెంకయ్యనాయుడుకు రాష్ట్రపతి అయ్యేందుకు అవకాశం ఉన్నవేళ ఆయనను ఇల్లు ఖాళీ చేయించి హైదరాబాద్‌కు పంపించేశారు. దక్షిణాదికి ఢిల్లీలో గుర్తింపేలేదు. మోదీ వచ్చిన తర్వాత రాజకీయ వివక్ష ఎక్కువైంది.

### కేసీఆర్‌ది కుటుంబ సమస్య

కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే. వ్యక్తిగత వైరం లేదు, ఆయన ఇష్టాయిష్టాలతో నాకు పనిలేదు. కేసీఆర్ సమస్య ఆయన కొడుకు, కూతురు, అల్లుడే. గృహ నిర్బంధం చేసి ఏదో రకంగా సీఎం కావాలని చూస్తున్నది అల్లుడు, మీరిద్దరు కాదు నేను సీఎం అవుతా అని కవిత చూస్తున్నది. వారసత్వ రాజకీయాలు నమ్ముకున్న కేటీఆర్ సీఎం కావాలనుకుంటున్నారు. ఎన్టీఆర్ కొడుకు కాలేదు అల్లుడు అయ్యాడు కాబట్టి నేను ముఖ్యమంత్రిని అవుతా అని హరీశ్‌రావు అనుకుంటున్నారు. ఇన్ని సమస్యలు ఆ కుటుంబంలో ఉన్నాయి. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో వాళ్లే నిర్బంధించారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోవడం ఖాయం. వాళ్లది ఫెవికాల్ బంధం. వాళ్లిద్దరినీ వేర్వేరుగా చూడాలనుకోవడంలేదు. రెండింటినీ మడతేసి కొట్టాలన్నదే నా లెక్క. నాకు ఇప్పటికైతే జాతీయ రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన లేదు. ఇంకా 8 ఏళ్లు 2034 వరకు తెలంగాణ ప్రజల కోసం చాలా చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఏం చేయాలి, ఎలా చేయాలి అనేది పార్టీ నిర్ణయిస్తుంది.

## సంక్షోభం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఉన్నత స్థాయి బృందాలను ఏర్పాటు చేస్తారు. ఇంధనం, సరఫరా గొలుసులు, ఎరువుల పంపిణీ, ధరల పెరుగుదలను నియంత్రించడం వంటి అంశాలకు సంబంధించిన వ్యూహాలను ఈ బృందాలు రూపొందిస్తాయి. ఈ సంక్షోభాన్ని అధిగ మించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకోవాలి. కష్టకాలంలో మాదిరిగానే, కార్మికులు, నిరుపేదలు ఎక్కువగా నష్టపోతారు. వారిని ఆదుకోవడానికి రాష్ట్రాలు సిద్ధంగా ఉండాలి. నల్లబజారు, నిల్వలను నివారించడానికి చర్యలు తీసుకోవాలి' అని తెలిపారు. పశ్చిమాసియాలో వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించడానికి హర్మూజ్ జలసంధిని తెరవడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. 'మేము గల్ఫ్ దేశాల అధిపతులతో మాట్లాడుతున్నాం. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాతో సంప్రదింపులు జరుపు తున్నాం. దౌత్యపరమైన చర్చలతో ఈ ప్రాంతంలో శాంతి, ప్రశాంతతను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హర్మూజ్‌ను మూసివేయడం ఆమోదయోగ్యం కాదు. దాని గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై దాడులు ఖండ నీయం. అదే విధంగా, ఇంధన సౌకర్యాలపై దాడు లను మేం వ్యతిరేకిస్తాం. సంఘర్షణ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. 3,75,000 మంది భారతీ యులు సురక్షితంగా తిరిగొచ్చారు. 700 మంది వైద్య విద్యార్థులతో సహా 1,000 మంది ఇరాన్ నుంచి తిరిగొచ్చారు. భారతదేశంలో తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయి' అని అన్నారు.

# మాది ప్రజా సంక్షేమ బడ్జెట్

## ఈ ఏడాది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ యువశక్తి పథకాలు అమలు చేస్తాం

**భారాసకు శాసనసభ, ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు**

**శాసనసభ, మండలిలో బడ్జెట్‌పై సమాధానమిచ్చిన డిప్యూటీ సీఎం**

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతిపైసాకు లెక్కకట్టి పనిచేసేలా ప్రభుత్వం బడ్జెట్‌తో ముందుకు వెళ్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని ప్రగతిశీల బడ్జెట్ తీసుకువచ్చామని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్షనేత కేసీఆర్ సభకు రావడం లేదని, భారాస సభ్యులకు శాసనసభ, ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేదని విమర్శించారు. భారాస సభ్యులకు అక్కసు ఉంటే ఇంట్లోనే కూర్చోవాలని, ప్రజల కోసం పెట్టిన బడ్జెట్‌ను చింపేసి చెవిలో పెట్టుకొని వెళ్లడం తగదన్నారు. గతంలో భారాస ఏటా 20–25% అంచనాలు పెంచుతూ బడ్జెట్ పెట్టేదని.. ఆ లెక్కన చూస్తే ఇప్పుడు రూ.5లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాలన్నారు. కానీ తాము వాస్తవిక బడ్జెట్ తీసుకువచ్చామని చెప్పారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూసి ఓర్వలేకపోతున్నారని, బడ్జెట్‌పై మాట్లాడేందుకు విషయం లేకపోవడంతోనే వెళ్లిపోయారన్నారు. భారాస హయాంలో ఆర్థిక, పరిపాలన వ్యవస్థను విధ్వంసం చేశారని... వారు చేసిన అప్పులు, వాటికి వడ్డీలు కట్టేందుకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో రూ.1.59లక్షల కోట్ల అప్పులు చేస్తే.. రాష్ట్ర ఆదాయం రూ.25వేల కోట్లు కలిపి మొత్తం రూ.1.85లక్షల కోట్లు ఈఎంఐ, వడ్డీల కోసం బ్యాంకులకు కట్టిందని.. ఈ లెక్కలు బయటపడతాయని ప్రధాన ప్రతిపక్షం వాకౌట్ చేసిందని వివరించారు. మంగళవారం శాసనసభ, మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు.

### ప్రపంచంతో పోటీపడే స్థాయికి తెలంగాణ..

"తెలంగాణ ప్రపంచంతో పోటీపడుతోంది. 2047 ఏడాదికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రాష్ట్రంలో ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుంటే చూసి భారాస బాధపడుతోంది. ప్రభుత్వం ప్రతిపాదించిన క్యూర్, ప్యూర్, రేర్ ఎకానమీని ఎవరూ ఆపలేరు. బడ్జెట్‌లో పేర్కొన్న పథకాలన్నీ అమలు చేశాం. ఆర్థిక కారణాలు, వనరుల సమీకరణలో ఆలస్యం కారణంగా ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రాజీవ్ యువశక్తి పథకాలను అమలు చేయలేకపోయాం. ఈ ఏడాదిలో ఈ రెండూ అమలు చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.2 కోట్ల ప్రమాదబీమా పథకాన్ని అమలు చేస్తున్నాం. విధి నిర్వహణలో చనిపోయిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఇస్తే తప్పన్నట్లుగా ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. భారాస అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షనేతగా ఉన్న నన్ను ఎన్ని అవమానాలకు గురిచేసిందో.. అందరికీ తెలుసు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మొట్టమొదటిసారి రాష్ట్రంలో ప్రారంభిస్తున్నాం.

### కేంద్రం వాటా రాకుండా పోయింది

రైతుభరోసా, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మఇళ్లు, రూ.500కు గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మి, సన్నబియ్యం తదితర సంక్షేమ పథకాల కోసం రూ.50వేల కోట్లు కేటాయించాం. రైతు భరోసాకు రూ.18వేల కోట్లు ఇచ్చాం. గత ప్రభుత్వం కేంద్ర పథకాలను గాలికి వదిలేయడంతో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన 60% వాటా రాకుండా పోయింది. ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ ప్రతినెలా రూ.700కోట్ల వరకు క్లియర్ చేస్తున్నాం. నెలకు అదనంగా మరో రూ.300కోట్ల చొప్పున చెల్లిస్తాం. యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణ పనులు వేగవంతం చేశాం. ఏటీసీల్లో చదివేవారికి నెలకు రూ.2వేల ఉపకారవేతనంతోపాటు సీఎం ఓవర్‌సీస్ ఉపాధి కల్పన కింద ఏటా 10వేల మందికి విదేశీ ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

### రూపాయి వెళ్తే వచ్చేది 30 పైసలే..

మేం అధికారంలోకి వచ్చాక విద్యుత్తు ఛార్జీలు పెంచలేదు. కానీ కేంద్రం విద్యుత్తు సబ్సిడీలు ఇవ్వకుండా ఛార్జీలు పెంచాలని సూచిస్తోంది. కేంద్రం సూచించిన సంస్కరణలు అమలు చేయడం లేదని పదేళ్లుగా విద్యుత్తు ప్రోత్సాహకాలు నిలిపివేసింది. ఏది ఏమైనా సబ్సిడీ కొనసాగిస్తూ, పేదలకు 200 యూనిట్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కొనసాగిస్తాం. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూపాయి వెళ్తే.. అందులో 30 పైసలే వెనక్కు వస్తున్నాయి. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి 2014 వరకు పని చేసిన ప్రధానులు రూ.56.66 లక్షల కోట్లు అప్పులు చేస్తే.. నరేంద్ర మోదీ 12 ఏళ్ల కాలంలో రూ.140 లక్షల కోట్ల కొత్త అప్పులతో మొత్తం అప్పులు రూ.197లక్షల కోట్లకు చేరుకున్నాయి. మీరాలం ట్యాంక్‌పై నిర్మించే వేలాడే వంతెన ఒక ఐకానిక్‌బ్రిడ్జి అవుతుంది. బయ్యారంలో స్టీలు ప్లాంటు సాధ్యం కాకుంటే... ఇంకా ఏదైనా ప్లాంటు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం" అని భట్టి తెలిపారు.

### 'మెడికల్ ఇన్‌వాలిడేషన్'లపై విచారణ

భారాస హయాంలో ఐదేళ్లలో సింగరేణి కాలరీస్‌లో ఏకంగా 13 వేల మందికి 'మెడికల్ ఇన్‌వాలిడేషన్' నియామకాలు జరిగాయని.. దీనిపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ఉదయం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో భారాస మండలి సభాపక్ష నేత మధుసూదనాచారి అడిగిన ప్రశ్నకు భట్టి విక్రమార్క బదులిచ్చారు. "సింగరేణిలో 2000 నుంచి 2014 వరకు 'మెడికల్ ఇన్‌వాలిడేషన్'ల సంఖ్య 3,859 మాత్రమే. 2014 నుంచి ఐదేళ్లలో ఆ సంఖ్య 13,119. అవసరం లేకపోయినా పెద్దసంఖ్యలో 'మెడికల్ ఇన్‌వాలిడేషన్'ల వల్ల అది సింగరేణికి ఆర్థికంగా భారంగా మారింది. ఈ వ్యవహారంలో ఏసీబీ, విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నాం. మానవీయ కోణంలో పరిశీలించి నిజంగా ఆధారపడిన కుటుంబాలను అనుమతించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి. వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. దీన్ని భవిష్యత్తు తరాలకు అందించాలంటే మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఐనా.. ఆగని దాడులు!

**ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర బాంబుల వర్షం కనిపించని ట్రంప్ 'విరామ' ప్రభావం**

**రెండు ఇంధన వ్యవస్థలకు భారీ నష్టం: ఇరాన్.. బాంబుల మోతతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్**

**టెల్ అవీవ్‌పై భారీ దాడులకు దిగిన ఇరాన్.. బహ్రెయిన్‌పై డ్రోన్ దాడుల్లో సైనికుని మృతి**

**యూఏఈలో ఒక కాంట్రాక్టర్ మరణం.. గంటల తరబడి చీకట్లో మగ్గిన కువైట్**

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐదు రోజుల విరామం ప్రకటించినా మిత్ర దేశం ఇజ్రాయెల్ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. మంగళవారం కూడా ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులతో విరుచుకుపడింది. ఇరాన్ కూడా దీటుగా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ప్రతి దాడులకు దిగింది. అంతేగాక 'పూర్తి విజయం'సాధించేదాకా పోరాడుతూనే ఉంటామంటూ ఇరాన్ సైన్యం కుండబద్దలు కొట్టింది! దీనికితోడు అమెరికా కూడా వేలాదిమంది మెరైన్ సైనికులను గల్ఫ్‌కు పంపిస్తోంది. దాంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పట్లో సమసిపోయే పరిస్థితులు కన్పించడం లేదు.

దీనికి తోడు ట్రంప్ పేర్కొన్న చర్చలు మంగళవారం ఏ మేరకు పురోగతి సాధించాలన్న దానిపై కూడా పెద్దగా స్పష్టత లేకుండా పోయింది. అయితే ఈ విషయమై ప్రస్తుతానికి అమెరికా, ఇరాన్ నడుమ విశ్వాస కల్పన చర్యలు కొనసాగుతున్నట్టు ఈజిప్టు వెల్లడించింది. యుద్ధానికి తెర దించే దిశగా ఇరాన్‌తో రెండు రోజులకు పైగా కీలక చర్చలు జరుగుతున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించడం తెలిసిందే. "చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఒక ముఖ్య నేతతో పాటు పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, నా అల్లుడు జెరేడ్ కుష్నర్ వాటిలో పాల్గొంటున్నారు. చర్చలు ఈ వారమంతా కొనసాగుతాయి"అని ఆయన చెప్పారు. ఇరాన్ మాత్రం ట్రంప్ చర్చల వ్యాఖ్యలను ఖండించింది.

### చమురు క్షేత్రాలకు నష్టం

ఇరాన్‌లోని ఉత్పత్తి కేంద్రాలే లక్ష్యంగా మంగళవారం భారీ స్థాయిలో దాడులు కొనసాగించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ ఉత్తర ప్రాంతంలో భారీ పేలుడు శబ్దాలు విన్పించాయి. దాడుల్లో రెండు ఇంధన క్షేత్రాలు భారీగా దెబ్బ తిన్నట్టు ఇరాన్ వార్తా సంస్థ ఫార్స్ న్యూస్ పేర్కొంది. "ఇస్ఫహాన్‌లోని సహజవాయు కేంద్రంపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. ఖొర్రంషార్‌లో కీలక విద్యుత్కేంద్రానికి గ్యాస్ సరఫరా చేసే పైప్‌లైన్లు కూడా తీవ్రంగా దెబ్బ తిన్నాయి"అని పేర్కొంది. లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేసింది. బీరూట్ దక్షిణ శివార్లలో హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ స్థావరాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించింది. ఒక అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో కనీసం ముగ్గురు మృత్యువాత పడ్డట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. దాడుల నేపథ్యంలో లెబనాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ రాయబారిని దేశం వీడాల్సిందిగా ఆదేశించింది. ఇరాన్ విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తున్నట్టు కూడా ప్రకటించింది.

### టెల్ అవీవ్‌లో విధ్వంసం

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైకి పలు దఫాలుగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో టెల్ అవీవ్ నగరంలో భారీ విధ్వంసం జరిగినట్టు తెలుస్తోంది. 100 కిలోలకు పైగా బరువున్న వార్ హెడ్ సిటీ సెంటర్ సమీపంలోని వీధిపై పడింది. ఒక అపార్ట్‌మెంట్‌తో పాటు పలు భవనాలు దెబ్బ తిన్నాయి. నలుగురికి స్వల్ప గాయలయ్యాయి. ఇరాన్ డ్రోన్ దాడులతో కువైట్‌లో విద్యుత్ సరఫరా లైన్లు దెబ్బ తిన్నాయి. దాంతో పలు ప్రాంతాలు గంటల తరబడి చీకట్లో మగ్గాల్సి వచ్చి?చంది. సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. పలు డ్రోన్లను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు నేలకూలి?చనట్టు యూఏఈ ప్రకటించింది. ఇరాన్ దాడుల్లో తమ సైనికుడు మరణించినట్టు బహ్రెయిన్ వెల్లడించింది. పలువురు సైనికులకు గాయాలైనట్టు తెలిపింది. యూఏఈలో జరిగిన దాడుల్లో మొరాకోకు చెందిన ఒక కాంట్రాక్టర్ మరణించినట్టు సమాచారం. బహ్రెయిన్‌లోని తమ డేటా సెంటర్‌లో కార్యకలాపాలకు డ్రోన్ దాడులతో అంతరాయం కలిగినట్టు అమెజాన్ సంస్థ వెల్లడించింది. దాడులతో అక్కడ సంస్థ కార్యకలాపాలు ప్రభావితం కావడం ఇది రెండోసారి.

### ఇజ్రాయెల్‌లో 16కు పెరిగిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంలో హెజ్బొల్లా దాడుల్లో ఒక రైతు మరణించాడు. దాంతో ఆ దేశంలో మృతుల సంఖ్య 16కు పెరిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ 4,5654 మంది గాయపడ్డట్టు ఆ దేశ అత్యవసర వైద్య సేవల విభాగం పేర్కొంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులకు బలైనవారి సంఖ్య 1,000 దాటింది. ఇక ఇరాన్‌లో ఇప్పటిదాకా 1,500 మందికి పైగా మరణించారు.

### యుద్ధ నెపం హెగ్సెత్‌పై! దాడి చేద్దామన్నది ఆయనే: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌పై ఏకపక్షంగా యుద్ధానికి దిగి ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నాల్లో పడ్డారు. ఇరాన్‌పై దాడులు చేద్దామని తొలుత సూచించింది తమ రక్షణ మంత్రి పీట్ హెగ్సెతే అని ఆయన తాజాగా చెప్పుకొచ్చారు! టెనెసీలో జరిగిన ఓ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ట్రంప్ ఆ వ్యాఖ్యలు చేసినప్పుడు హెగ్సెత్ ఆయన పక్కనే ఉండటం విశేషం.

"ఇరాన్ సమస్యపై ఆ మధ్య నా సన్నిహితులందరినీ పిలిచి లోతుగా చర్చించా. పరిస్థితిని వారికి వివరించా. అణు బాంబు తయారీకి ఇరాన్ చాలా దగ్గరికి వచ్చేసింది, ఏం చేద్దామని అడిగా. అందరికంటే ముందు హెగ్సెత్ స్పందించారు. ఇరాన్‌పై దాడి చేద్దామని చెప్పుకొచ్చారు" అన్నారు. అంతేగాక పక్కనే ఉన్న హెగ్సెత్‌కేసి తిరిగి, "అంతేకదా! ఇరాన్‌పై దాడి చేద్దామని ముందుగా చెప్పింది నువ్వే కదా! ఇరాన్ అణుబాంబు తయారు చేసేందుకు అవకాశమివ్వొద్దని కూడా అన్నావు"అంటూ అడిగారు.

# పట్టు వీడని విక్రమార్కుడు..

(మొదటి పేజీ తరువాయి)



రాజీనామా చేయనున్నారు.. ఆరు మార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎం ఏల్సిగా గెలుపొంది తెలంగాణలో తనదైన ముద్ర వేసుకున్నాడు. జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం బతికపెల్లిలో తాటిపర్తి రాంచంద్రారెడ్డి- లింగమ్మ దంపతులకు 1951, జనవరి 5న జీవన్ రెడ్డి జన్మించారు..బీఏ ఎల్ఎల్ బీ చదివిన జీవన్ రెడ్డి జగిత్యాల కోర్టులో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. రాజకీయం పట్ల ఆసక్తి ఉన్న ఆయన 1981లో మల్యాల సమితి అధ్యక్షుడిగా మొదటిసారి రాజకీయ అరంగేట్రం చేశారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరి 1983లో ఎమ్మెల్యేగా గెలుపొంది, మొదటిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అదే ఏడాది జనవరి 9న ఎన్టీఆర్ కేబినెట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నాదెండ్ల భాస్కర్ రావు కేబినెట్‌లో ఎక్సైజ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1985లో ఎమ్మెల్యేగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రాజేశం గౌడ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. 1989లో తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 1994లో ఎల్.రమణ చేతిలో ఓటమిపాలయ్యాడు. 1996లో జరిగిన ఉప ఎన్నికలో గెలుపొందిన ఆయన అనంతరం 1999, 2004, 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా విజయం సాధించి, ఆరుసార్లు అసెంబ్లీకి ఎన్నికై రికార్డు సృష్టించారు. 2006లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఉద్యమ నేత కేసీఆర్ చేతిలో ఓడిపోయిన జీవన్ రెడ్డి ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందాడు. అప్పుడే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ తర్వాత 2008లో మరోమారు కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేసి కేసీఆర్ కు ముచ్చెమటలు పట్టించాడు. తెలంగాణ ప్రాంతంలో గుర్తింపు పొందిన జీవన్ రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశారు. 2014 లో జరిగినఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ లో ఒకే ఒక్క ఎమ్మెల్యేగా రికార్డులకెక్కడంతో పాటు శాసన సభ పక్ష ఉప నేతగా ఎంపికయ్యాడు. అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి మాకునూరి సం జయ్ కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2019లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి జీవన్ రెడ్డి పోటీ చేసి మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలుపొంది రికార్డు సాధించారు. శాసన మండలిలో అడుగుపెట్టిన జీవన్ రెడ్డి రైతుల, పట్టభద్రుల, ప్రజల సమస్యలపై పోరాడుతూ తనదైన ముద్రవేసుకున్నాడు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా ఉంటూ జనం మెచ్చిన జనహృదయ నేతగా, రైతు బాంధవుడిగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారు..2024 జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో మరోసారి సంజయ్ కుమార్ చేతిలో ఓటమి చెందినప్పటికి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం తో నిజామాబాద్ ఎంపీ గా బరిలోకి దిగి ఓడిపోయారు... గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ జీవన్ రెడ్డి మాత్రం ప్రతిపక్ష హోదాలో ఉన్నట్లు ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారు...గత కొన్ని రోజులుగా జగిత్యాలలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు ప్రభావంతో జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో పడ్డారు..అధిష్టానం ఎమ్మెల్యే ల నుంచి మంత్రులు, టీపీసీసీ ఛీఫ్, రాహుల గాంధీ దూత వచ్చిన జీవన్ రెడ్డి నిర్ణయం లో మార్పు రాలేదు. దింతో పట్టు వీడని విక్రమార్కుడి లా జీవన్ రెడ్డి తన 43 ఏళ్ల కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానానిని నేడు ఫుల్స్టాఫ్ పెడుతున్నారు

# లోక్ అదాలత్ ద్వారా సామరస్యంతో సమస్యల ముగింపు

- రాజీ మార్గంలో వివాదాల పరిష్కారం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**(వి,వెంకటేష్, ప్రజాతీర్పు మంచిరాల స్టాప్ రిపోర్టర్ మార్చ్ 24**



ఈ నెల 28వ తేదీ శనివారం నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా,రాజీ మార్గంలో, పరిష్కారమవుతాయని తెలిపారు.రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన, కుటుంబపరమైన మరియు వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూలు, విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా చర్చించుకుని రాజీకి రావచ్చు.

**రాజీయే రాజమార్గం**

చిన్న చిన్న తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,డబ్బు వృథా చేయవద్దు. జుడీషియల్ శాఖ అందించిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇరుపక్షాలు శాంతియుత పరిష్కారం పొందాలని సూచించారు.పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని అన్ని పోలీస్ అధికారులు,కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు పోలీస్ సిబ్బందికి సరైన మార్గదర్శకాలు ఇచ్చి,రాజీ పడదగిన కేసులను గుర్తించాలి. ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ సాధించే ప్రయత్నాలు చేయాలని కమిషనర్ సూచించారు.తమ కేసుల్లో రాజీ కావాలని కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు.

**లోక్ అదాలత్ గురించి ప్రజలకు సూచనలు:**

**ఇరుపక్షాల సమ్మతితో మాత్రమే రాజీ సాధ్యం.**

లోక్ అదాలత్‌లో జరిగిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా, పరిగణించబడుతుంది.ప్రతి కేసులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కారం జరుగుతుంది. ప్రజలు, పోలీసులు, న్యాయస్థానాలు కలిసికట్టుగా పనిచేస్తే చిన్న వివాదాలు కూడా పెద్ద సమస్యలుగా మారకుండా ముందే పరిష్కరించవచ్చు అని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు.



# కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై పరిశీలన

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 24.**

కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు , ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**( కొప్పరపు రాజిరెడ్డి, ప్రజాతీర్పు ప్రతినిధి బెజ్జంకి) మార్చి 24**

మండల కేంద్రంలో విలాసాగర్ అరుణ, దాచారం గ్రామంలో దయ్యాల జితేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాన కొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాకాల మైపాల్ రెడ్డి, సర్పంచ్ బొల్లం శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి ఉప సర్పంచులు దీటి బాల నర్సు, దోమల మహేష్, సోషల్ మీడియా ఇన్చార్జి ఎల శేఖర్ బాబు , మాజీ ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్, వడ్లకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిరాల స్టాఫ్ రిపోర్టర్) మార్చి 24**



క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం టి. బి. ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్ నాయక్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని తెలిపారు. 100 రోజుల పాటు క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, తెమడ పరీక్ష, ఎక్స్ రే తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని గుర్తించవచ్చని, సరైన సమయంలో చికిత్స అందించినట్లయితే పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో పరీక్షలు, చికిత్స, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు అయినట్లయితే వ్యాధి నివారణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. క్షయ ప్రభావిత ప్రాంతాలలో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు చేయడం జరుగుతుందని, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, పోషకాహార లోపం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించడం ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని, ప్రజలు సొంత ఆలోచనతో మందులు,వినియోగించకూడదని, ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని, వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వినియోగించాలని తెలిపారు. క్షయ వ్యాధి నివారణలో భాగంగా ఆరోగ్య ఉపకేంద్రాల వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. వ్యాధి పూర్తిగా నయం అయ్యేవరకు తప్పనిసరిగా వైద్యుల సూచన ప్రకారం మందులను వినియోగించాలని, వ్యాధి నయం అయిన తరువాత వైద్య పరీక్షల నివేదిక అనంతరం వైద్యుల సూచన మేరకు మాత్రమే మందుల వినియోగం ఆపాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కీలు ఫౌండేషన్ ద్వారా డా. రాజ్ కిరణ్ సంస్థ ద్వారా న్యూట్రిషన్ కిట్లను అందించడం జరిగిందని, ఈ కిట్లు వినియోగించడం ద్వారా వ్యాధిని ఎదుర్కొనవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నిశ్చయ భూషణ్ యోజన క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు పోషణ మధ్యము చికిత్స కాలం వరకు అందించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గిన, తుమ్మిన క్షయ క్రిములు బయటకు వస్తాయని, మాస్క్ ధరించినట్లయితే నియంత్రించవచ్చని, సాధ్యమైనంత వరకు గాలి, వెలుతురు ఉన్న ప్రాంతాలలో ఉండాలని తెలిపారు. జిల్లాలో 759 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు అందించడం జరుగుతుందని, పోషకాహారం కోసం డి బి టి ద్వారా 150 మంది రోగులకు 6 వేల రూపాయల చొప్పున పోషకాహారం కోసం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రజలలో వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించడం, సమయానికి మందులు అందించడం జరుగుతుందని, జిల్లాలోని రోగులకు పోషకాహారం అందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, క్షయ వ్యాధి రహిత జిల్లాగా మంచిర్యాలను తీర్చిదిద్దుదామని తెలిపారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పొన్నారం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించి నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా వివరించాలని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. గ్రామంలో నర్సరీని సందర్శించి వేసవి అయినందున సకాలంలో నీటిని అందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, వైద్యాధికారులు డా. అరుణ శ్రీ, డా. రమేష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సి పి ఓ లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీతో కేసులను పరిష్కరించుకోండి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ...**

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 24.**



28-03-2026 శనివారం రోజున నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.రాజీ మార్గమే రాజమార్గమని, జుడిషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు.కాబట్టి తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# సిద్ధార్థ విద్యార్థుల మేధో ప్రస్థానం

**ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో వెండి, బంగారు పతకాల పంట**

**చెన్నారావుపేట మార్చి 24 (ప్రజా తీర్పు)**



మండల కేంద్రంలోని స్థానిక సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటి పాఠశాల కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు. సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ (ఎస్ఓఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు జోనల్ స్థాయిలో పతకాలు సాధించి సంచలనం సృష్టించారు.గత జనవరి 22న నిర్వహించిన ఇంటర్నేషనల్ కంప్యూటర్ సైన్స్ ఒలింపియాడ్ (ఐసిఎస్ఓ)పరీక్షలో పాఠశాల విద్యార్థి పి.శశాంక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. కఠినమైన ప్రశ్నలతో కూడిన ఈ పోటీలో శశాంక్ జోనల్ స్థాయిలో 2వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఈ ఘనతకు గాను అతడికి 2,500 వందల నగదు బహుమతి, జోనల్ సిల్వర్ మెడల్ మరియు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. అదేవిధంగా, ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (ఐఎంఓ)లో ఈ పాఠశాలకే చెందిన విద్యార్థిని ఉంద్రాతి ప్రగతి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. గణిత శాస్త్రంలో తనకున్న పట్టును నిరూపించుకుంటూ బంగారు పతకాన్ని ముద్దాడటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ విజేతలను అభినందిస్తూ పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే ఇలాంటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శశాంక్, ప్రగతి సాధించిన విజయాలు తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్ రెడ్డి, ఎస్ఓఎఫ్ కో-ఆర్డినేటర్ మేడి రమేష్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితుల హక్కులను కాల రాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**జగిత్యాల రూరల్, మార్చి 24 (ప్రజా తీర్పు)**




జగిత్యాల జిల్లా దళిత హక్కుల పోరాట సమితి డి హెచ్ పి ఎస్, జగిత్యాల రెండో మహాసభలో ఏఐడీఆర్ఎం జాతీయ కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్ ,మాట్లాడుతూ. దేశానికి స్వతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా అట్టడుగు వర్గాలైన దళితులు అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ దళితులకు దరి చేరడంలేదు. భారత రాజ్యాంగం ప్రతి మనిషికి ఓటు హక్కు కల్పించడం జరిగినది, తరతరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్ష, దోపిడి పీడనాల కింద నలిగిపోతున్న వర్గాలు దళితులు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయం కోసం విద్య వైద్య వ్యాపారని రద్దు చేయాలని,ఉపాధి అవకాశాల కోశం దేశ సంపదలో దళితుల వాటా కోసం సమర శంఖం పూరించడానికి 2026 ఏప్రిల్ 17,18, వరంగల్ లో జరిగే రాష్ట్ర రెండో మహాసభలకు జగిత్యాల జిల్లా నుండి అధిక సంఖ్యలో ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. తాళ్లపల్లి లక్ష్మణ్ డి హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా రాజకీయ సామాజిక హక్కుల పరిరక్షణ కోసం, కుల వివక్షత కుల నిర్మూలన కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ను అమలు చేయాలని నిధులు కేటాయించాలని స్వయం ఉపాధి పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ రెండో మహాసభలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మునుగురి హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్,లను ఉపాధ్యక్షులుగా సురేష్ సహాయ కార్యదర్శిగా ప్రవీణ్ కోశాధికారి రాజయ్య,చిలుముల మైసయ్య,జుట్టు శేఖర్,మచ్చ అంజయ్య,గుండు నారాయణ,మునుగురి గంగనార్సయ్య,తాటి కొండ నరేదార్, వెూదంగుపాలి మల్లయ్య, బొమ్మనా పురుషోత్తం,మల్లార్పు నర్సయ్య,ఎన్నుకోవడం జరిగింది. మరో 13 మందిని కార్యవర్గ కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# బుడిగజంగాల కాలనీ "అంజన్న"కు కొత్త శోభ

- ఆంజనేయ స్వామికి.. తొడుగు బహుకరణ
- తొడుగు బహుకరించిన ఎజ్జు స్వప్న వేణు దంపతులు

**హుజురాబాద్ మార్చి 24 (ప్రజాతీర్పు)**

హుజురాబాద్ పట్టణం 22, 23 వ వార్డుల పరిధిలోని బుడగ జంగం కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష రూపాయల విలువైన ఇత్తడి తొడుగును ఎజ్జు స్వప్న వేణు దంపతులు మంగళవారం అందజేశారు. పట్టణంలోని ప్రధాన ఆంజనేయస్వామి ఆలయం, పాటి మీద అంజన్న ఆలయం తర్వాత 22వ వార్డులోని ఈ ఆలయమే ప్రధాన ఆకర్షణగా ఉంది. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శిస్తారు. మంగళ, శనివారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. నిత్య ధూప దీప నైవేద్యాలతో దేవాలయాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సుమారు 16 సంవత్సరాల క్రితం భక్తులు ఆంజనేయస్వామిని ప్రతిష్టించి ఆలయాన్ని నిర్మించారు. ఆయా పండుగలు పర్వదినాల్లో, శ్రావణ కార్తీక, ధనుర్ మాసాల్లో పెద్ద



సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. అలాగే ప్రతి ఏడాది శ్రీరామనవమికి కళ్యాణం ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనికి పెద్ద సంఖ్యలో భక్తజనం హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి తొడుగును బహుకరించిన స్వప్న వేణు దంపతులను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మాజీ కౌన్సిలర్పోరెడ్డి రజిత శంతన్ రెడ్డి పృద్విరాజ్, ఆనంద్ సతీష్ ఎజ్జు రాజు అభిరామ్ సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది...అవార్డులు బాధ్యతలను పెంచుతాయి

**(కవ్వాల సురేందర్, ప్రజా తీర్పు, వేములవాడ) మార్చి 24:**

వేములవాడమున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న విక్కుర్తి లక్ష్మీనారాయణ తెలంగాణ సాహితి కళా సేవా సమితి ఉగాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా వారిని పాఠశాల లో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రజాక్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్ మాట్లాడుతూ " అవార్డులు వృత్తి బాధ్యతలను మరింత పెంచుతాయని, అందులో ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది గౌరవప్రదమైనదని, ఎందుకంటే ఇది ఉత్తమ సమాజ నిర్మాణానికి, దేశ భవిష్యత్తును రూపుదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తుందని, విద్యార్థులలో క్రమశిక్షణ జ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని, సంస్కృతిని ఉన్నత మార్గంలో ఉంచడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని, ఇంజనీర్లు, డాక్టర్లు, నాయకులు మరియు ఆవిష్కర్తల వంటి దేశ పౌరుల భవిష్యత్తును ఉపాధ్యాయులు రూపొందిస్తారని, విద్యార్థులకు అవసరమైన కమ్యూనికేషన్, క్రమశిక్షణ మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను బోధించి, వారిని జ్ఞానవంతులుగా మారుస్తారని, ఉపాధ్యాయులు కేవలం విద్యను అందించడమే కాకుండా విద్యార్థులు నైతిక విలువలను పెంచి వారిని ఉత్తమ పౌరులుగా మారుస్తారని, విద్యార్థుల జీవితంలో మార్పు తీసుకురావడంలో మరియు కష్ట సమయాల్లో సరైన మార్గదర్శకత్వం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమైనదని,' పాఠశాల లేని పల్లెటూరు అయినా ఉండవచ్చేమో గాని ఉపాధ్యాయుడు లేని ఊరు మాత్రం ఉండకూడదు' అనే మాట ఉపాధ్యాయుని ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు. సయ్యద్ షబ్బీర్.అక్కన్న పెళ్లి పరుశురాం పాల్గొన్నారు.



## బీజేపీ పాలనలో పేదలపై భారాలు కార్పొరేట్లకు లాభాలు ఇదే ప్రభుత్వ అసలు ముఖం

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మార్చ్ 24**

ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల పాలన ఉండాలని చెప్పుకునే ప్రభుత్వం ప్రస్తుతం ప్రజలకే వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తీవ్రంగా విమర్శించారు. దేశంలోని పేదల ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ పథకం పేదల జీవనోపాధికి ఎంతో ముఖ్యమని, సంవత్సరానికి 100 రోజుల పని కల్పించడం ద్వారా వారికి కనీస ఆదాయం లభించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం ఇచ్చే వేతనాలు సరిపోవడం లేదని, రోజుకు ?200తో పేదవాడి జీవితం సాగడం కష్టమని స్పష్టం చేశారు. ఇదే సమయంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలకు, ముఖ్యంగా ఆదాని, అంబానీ వంటి సంస్థలకు భారీగా టాక్స్ రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. విదేశీ కంపెనీలకు డేటా సెంటర్ల పేరుతో లక్షల కోట్ల రూపాయల టాక్స్ సడలింపులు ఇస్తూ, పేదల కోసం ఉన్న పథకాలను మాత్రం తగ్గించడం అన్యాయమని ఆయన అన్నారు. పేదవాడికి సహాయం చేయాల్సిన సమయంలో డబ్బు లేదని చెప్పే ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలకు మాత్రం లక్షల కోట్ల రాయితీలు ఇవ్వడం స్పష్టమైన ద్వంద్వ వైఖరిలి అని గడ్డం వంశీ కృష్ణ ఘాటుగా విమర్శించారు. పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాపాడే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి వారికి తగిన వేతనాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ధూప దీప నైవేద్య అర్చక సంఘం మండల నూతన అధ్యక్షుడిగా రవికుమార్

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 24 :**



వేములవాడ మండల దూపదీప నైవేద్య అర్చక సంఘం ప్రత్యేక సమావేశం మంగళవారం భగవంత రావు నగర్ లోని గాయత్రి మాత ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ దూప దీప నైవేద్యా అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చర్లపల్లి లక్ష్మీకాంత్ శర్మ. అధ్యక్షులుగా గొంగళ్ళ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా చర్లపల్లి సీతా రాములు, కోశాధికారిగా మరింగంటి మధుసూ ధనాచార్యులు, ముఖ్య సలహాదారులుగా సనుగుల భాస్కర్ మారం రాజేశం కార్యవర్గ సభ్యులుగా చంద్రగిరి దాశరథి, రామక, మనోహర్ గొంగళ్ళ నాగరాజు, గొంగళ్ళ మహేశ్వర్, మాసం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గొంగళ్ళ రవికుమార్ మాట్లాడుతూ ధూప దీప నైవేద్య అర్చక సభ్యుల సంక్షేమం కొరకై యాక్సిడెంట్ పాలసీ చేస్తూ ఈరోజు తీర్మానం చేయడమైందని సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. ప్రధాన కార్యదర్శి సీతారాములు మాట్లాడుతూ డి డి ఎన్ మండల అర్చక సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మీ అందరూ మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.



## బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం

**సూర్యాపేట, మార్చి 24 (ప్రజాతీర్పు)**

సూర్యాపేట జిల్లా చివ్వెంల ప్రాజెక్ట్ పరిధిలోని మోతే మండలం రామాపురం తండా గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ,బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బానోతు సత్తెమ్మ అధ్యక్షతన "మిషన్ వాత్సల్య పథకం" బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం ను ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమం (99 రోజులు)లో భాగంగా గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ స్థాయి పరిరక్షణ కమిటీల లో గ్రామ సర్పంచ్ మరియు వారి కమిటీ సభ్యులు అందరు కలిసి కమిటీ ఏర్పాటు బాధ్యత,ఐసీపీఎస్ కార్యక్రమాలు,అనాధ బాలలు,బాలల సంక్షేమ కమిటీ ,బాలల దత్తత విధానం,బాలల సమస్యలు,బాల కార్మకులు ,రక్షణ చర్యలు,బాల్య వివాహాలు, అధికారుల బాధ్యతలు,చైల్డ్ హెల్ప్ లైన్1098, బాలలపై వేధింపులు మొదలైన బాలలకు సంబంధించిన అంశాలను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతి సూపర్వైజర్,శ్రావణ్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి,డి.సి.పి.యు ప్రొటెక్షన్ ఆఫీసర్ షేక్ నాగుల్ మీరా,అంగోతు ఆశ,నీలిమ, అంగన్వాడి టీచర్స్,గ్రామ పెద్దలు,ఏ.యన్.యం షేక్ పర్వీన్,గంట నిర్మల ఆశ వర్కర్స్,పొదుపు సంఘం సభ్యులు,గ్రామస్థాయి భూక్యా సురేందర్, అంగోతు జబ్బర్ లాల్,ప్రజా ప్రతినిదులు అధికారులు మరియు తల్లిదండ్రులు బాలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి సీఐ చింతం శంకరయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

**మేడిపల్లి, మార్చ్ 24: (ప్రజాతీర్పు)**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిహెచ్ఎంసి పరిధి మేడిపల్లి మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతం శంకరయ్య (సీఐ)ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు రెవరెండ్ ఏ.వి.ఎన్ ఆమోస్, రెవరెండ్ మిక్కిలి విజయ్ కుమార్, రెవ. కేపా జోసెఫ్, రెవ. బి. భాస్కర్, పాల్ పాస్టర్ సైమన్ శ్రీనివాస్, పాస్టర్ పాల్ అబ్రామ్ తదితరులు పాల్గొన్నారు. పాస్టర్లు సీఐ ని కలిసి వారి విధుల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. సమాజంలో శాంతి, భద్రత పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా సామాజిక సేవా కార్యక్రమాలలో పోలీసు శాఖతో కలిసి పనిచేయడానికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. సీఐ కూడా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.



భవిష్యత్తులో ప్రజలకు సేవ చేయడంలో పరస్పర సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో కొనసాగి, పరస్పర అవగాహనను పెంపొందించేలా జరిగింది.



## జాతీయ రహదారుల విస్తరణలో భూ సేకరణ త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిరాల స్టాఫ్ రిపోర్టర్) మార్చ్ 24**

మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా చేపట్టిన భూసేకరణకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రావు తో కలిసి సందర్శించి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన 63, 163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## భీమన్నను దర్శించుకున్న ఉమ్మడి కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 24:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన అధికారులు

**(కొప్పరపు రాజిరెడ్డి, ప్రజా తీర్పు ప్రతినిధి బెజ్జంకి) మార్చి 24**

మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను మంగళవారం హౌసింగ్ డిప్యూటీ ఈ ఈ శంకర్, ఎంపీడీవో కడివేరు ప్రవీణ్, ఏఇ రవళి, సర్పంచ్ వెంకటలక్ష్మి కలిసి పరిశీలించారు. త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని చూచించారు.



## సింగరేణి కార్మికుల హక్కు నెలకు 10,000 పెన్షన్ వెంటనే అమలు చేయాలి

**(వి,వెంకటేష్ ప్రజాతీర్పు మంచిరాల స్టాప్ రిపోర్టర్) మార్చ్ 24**

సింగరేణి కార్మికుల సంక్షేమం పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ప్రత్యేకంగా స్పందించారు. సంవత్సరాల పాటు గనుల్లో కష్టపడి పనిచేసిన కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేకంగా రిటైర్ అయిన సింగరేణి కార్మికులకు నెలకు కనీసం 10,000 పెన్షన్ అందించాలని గట్టిగా డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు తమ జీవితాన్ని గనుల్లో కష్టపడి దేశానికి అంకితం చేశారు. అలాంటి వారికి రిటైర్మెంట్ తర్వాత కనీస భద్రత కూడా లేకపోవడం బాధాకరం. కనీసం 10,000 నెలకు పెన్షన్ ఇవ్వడం వారి హక్కు అని ఎంపీ, పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రభుత్వానికి ప్రాతినిధ్యాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి వారికి తగిన గౌరవం ఇవ్వాలని ఆయన కోరారు. చివరగా, సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ను వెంటనే అమలు చేయాలి. లేకపోతే వారి హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం అవుతుంది అని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, హెచ్చరించారు.



## బీర్పూర్ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**(కుమారస్వామి, ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మార్చి 24**

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో రైతు వేదికలో మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మంజూరైన 28 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్.అనంతరం బీర్పూర్ మండల కేంద్రంలో 1 కోటి 43 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను స్తానిక నాయకులు అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే త్వరితగతిన ఆసుపత్రి పనులు పూర్తి చేసి,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్ ఎమ్మార్వో సుజాత కడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు రాజగోపాల్ రావు,అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 24 :**

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి. గితే గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీవో) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, వార్డులు, గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా బాధితులకు తక్షణ స్పందన ఇవ్వాలని తెలిపారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకోవాలని బ్లూ కోల్ట్, పెట్రోల్ వాహన సిబ్బందిని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. నేరాల నివారణలో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పెంచాలని,కీలక ప్రదేశాల్లో మరిన్ని కెమెరాలు అమర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.



## వేములవాడలో శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ.

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 24 :**

వేములవాడ రాజన్న క్షేత్రంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు. మంగళవారం రోజున ఆలయ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో ఆలయ పరిసరాలు, శివర్చన ప్రదేశం, పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి పలు సూచనలు చేసారు. ఈసారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు సులభంగా, సౌకర్యవంతంగా దర్శనం కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని తెలిపారు. భక్తుల భద్రతా దృష్ట్యా బ్యారికేడ్లు,కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు,పార్కింగ్ సదుపాయాలపై , సైన్ బోర్డ్స్ పై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ రద్దీని నియంత్రించే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ గారి వెంట డిఎస్పీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆలయ ఈ ఈ రాజేష్, డి.ఈ రఘునందన్, రామ్ కిషన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో బండి లాలిత్య పుట్టిన రోజు వేడుకలు

**సూర్యాపేట మార్చి 24 (ప్రజాతీర్పు)**



హుజూర్ నగర్ పట్టణం ఎన్ ఏస్ పి క్యాంపులో గల భవిత కేంద్రంలో బండి శ్రీదేవి కృష్ణారెడ్డి కుమార్తె లాలిత్య పుట్టిన రోజు సందర్భంగా పిల్లలకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు.భవిత కేంద్రంలో పిల్లలతో తమ పాప పుట్టిన రోజు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తల్లిదండ్రులు చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో 19 వ వార్డు కౌన్సిల్ వల్లపుదాసు కృష్ణ,షేక్ మీరా పాషా,టీచర్ పెండెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ అవగాహన ర్యాలీ

**జమ్మికుంట మార్చి 24 (ప్రజాతీర్పు)**



ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ ర్యాలీని నిర్వహించడం జరిగినది. టి బి అంతం - మన అందరి పంతం. టి బి రహీత సమాజాన్ని -నిర్మిద్దాం. టి బికి -పరీక్షలు ఉచితం. టి బి కి - మందులు ఉచితం వంటి నినాదాలతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు,ర్యాలీ అనంతరం పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి టి బి వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. ఎవరికైనా రెండు వారాలకి మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవటం, రాత్రి పూట చెమటలతో జ్వరం రావటం, దగ్గులో తెమడ పడటం, అలసట వంటి మొదలగు లక్షణాలు ఉంటే వెంటనే హాస్పిటల్ కి వచ్చి పరీక్షలు చేహించు కోవాలని విద్యార్థులకు సూచించారు.వ్యక్తి గత పరిశుభ్రత పై అవగహన కల్పించినారు. వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. అనంతరం విద్యార్థులచే మానవహారం నిర్వహించి ,టి బి ప్రతిజ్ఞ ఛేహించినారు. ఈ కార్యక్రమములో డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యేసు మని, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధ,టిబి క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుపతి,ఆశా కార్యకర్త సునీత,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన 19 మందికి రూ.1,93,000/- జరిమానా

- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికీ కలిపి రూ.10,000/- జరిమానా
- సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్,

**(సిద్దిపేట, మార్చి 24 (ప్రజా తీర్పు ప్రతినిధి)**



సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 19 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా ఈ రోజున సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 19 మంది వ్యక్తులకి రూ. 1,93,000/- జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారికి ప్రమాదం మరియు రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ గారు విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



## క్షయ వ్యాధి (TB) పై అవగాహన సదస్సు

**కుత్బుల్లాపూర్, మార్చి 24 (ప్రజా తీర్పు) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం క్షయ వ్యాధి (టిడీ) నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిహెచ్ఎంసి డివిజన్ దీ=హా పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ.. సమాజంలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, ఒక ప్రదర్శన (హానెిట్) ద్వారా క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు వివరించారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని విద్యార్థులు వివరించారు.నర్సింగ్ విద్యార్థుల స్కిట్ మార్కెట్‌కు వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జి బాలసుబ్రమణ్యం , అరుణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ ముకుంద రావు, రవికుమార్ , సాజిద్ , సంజీవ గ షాబుద్దీన్ , జుబేర్ విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగ భీమా చెక్కు అందజేత

**(కుమారస్వామి, ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మార్చి 24**

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రానికి చెందిన అప్పాల మల్లేశం ఇటీవల మరణించగా ఈ రోజు ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ తుంగూరు శాఖ వారు.బ్యాంకు ఖాతాదా రుడు మల్లేశం కుటుంబ సభ్యులకు వారికి (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) పథకం ద్వారా రెండు లక్షల రూపాయల చెక్కు ఈరోజు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతుల మీదుగా వారి భార్య అప్పల గంగవ్వ గారికి బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ అందించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు చేయించుకోవాలని బ్యాంకు లు ఆర్థికంగా సహాయపడతాయని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో బీర్పూర్ సర్పంచ్ హరీష్ తుంగూర్ సర్పంచ్ రాజగోపాల్ రావు మాజీ కే డి సి సి మెంబర్ ముప్పాల రామచంద్ర రావు పిఏ సి ఎస్ సెక్రటరీ తిరుపతి అన్ని గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు



## మున్సిపల్ చైర్మన్ కు ఇల్లందకుంట బ్రహ్మోత్సవాల ఆహ్వానం

**జమ్మికుంట, మార్చి 24 (ప్రజాతీర్పు)**

అపర భద్రాద్రి గా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో జరుగబోయే బ్రహ్మోత్సవాలకు రాగలరని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో అందించిన దేవస్థానం చైర్మన్ రామారావు మరియు ఆలయ ధర్మకర్తలు ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జమ్మికుంట మున్సిపల్ పక్షాన పరిశుద్యం మరియు భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి విషయంలో మరే విషయాలలోనైనా మేము మా పాలకవర్గం రాజకీయపార్టీలకు అతీతంగా అందుబాటులో ఉండి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# క్షయ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

- మెదక్ శాసనసభ్యులు రోహిత్ రావులి
- జిల్లా లో క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనకు విస్తృత చర్యలులి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**




క్షయవ్యాధి (టీబీ) నివారణ పైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా టీబీ ముక్త భారత్ అభియాన్ ఙ.2.0 అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెదక్ శాసనసభ్యులు మైనాంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ శాసన శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ..క్షయవ్యాధి (టీబీ) నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపు పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు . మొదటగా అధిక జనాభా గల ప్రాంతం లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి చీూూ, మైక్రోస్కోపీ, ఎక్స్-రే ద్వారా నిర్ధారణకు పంపాలని అధికారులకు సూచించారు. డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు ఇతర సహవ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని, అన్ని కేసులను చీ×ఖూనాో పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని,అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని...గుర్తించిన (టీబీ) రోగులకు తక్షణ చికిత్స అందించాలన్నారు .ఎదీ నివారణకు ముందస్తు గుర్తింపు, వ్యక్తిగత పరిశుభ్రత, దీజ+ టీకా (టీబీ) లక్షణాలపై (దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు) ప్రజల్లో అవగాహన పెంపు చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ ..జిల్లాలో అధిక ప్రమాదం ఉన్న 99 గ్రామాలు గుర్తించడం జరిగిందని, జిల్లావ్యాప్తంగా 389 కేసులు గుర్తించామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నిశ్చయ పోషణ అభియాన్ పథకం కింద నెలకు వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఆ గ్రామాల్లో సమగ్ర స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు,ఈ కార్యక్రమంలో ప్రజలందరికి ఎక్స్-రే, స్పుటమ్ పరీక్షలు, హీమోగ్లోబిన్ (ఎఎ) పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. డి సి హెచ్ శివ దయాల్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ ఎదీ ముక్త భారత్ అభియాన్ 2.0 లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎ క్షయ వ్యాధి గుర్తించిన గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది మొదటి ప్రాధాన్యతగా ఇంటింటిని సందర్శించి ఇంట్లో ఉన్న 14 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు పలు పరీక్షలు చేసి వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులకు తక్షణమే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అంతకుముందు క్షయ వ్యాధి నివారణకై కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం క్షయ వ్యాధి నివారణ కోసం పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ హరిత నర్సింగరావు, సూపరిండెంట్ సరిత దేవి, శైలజ, హరి ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం అధికారులు, ×హీూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- యువత పోరాటాల ద్వారా అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలి.
- కేంద్ర ప్రభుత్వం కులమత విద్వేషాలను రెచ్చగొడుతుంది.
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు.

**చెన్నారావుపేట మార్చి 24 (ప్రజా తీర్పు)**



దేశంలో మోడీ ప్రభుత్వ మతోన్మాద ఫాసిజానికి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం కోనాపురంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. అమెరికా ఆంక్షలకు తలొగ్గి దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థి, యువత పోరాటాల ద్వారా అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు బుర్రి కుమారస్వామి,పైసా కుమార్, చెరుపెల్లి సాంబయ్య, చిరువూరు రమేష్, వంశీ, అక్షయ్, జగన్, అజయ్, రంజిత్, రవి హర్షవర్ధన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.




## కొత్తపల్లి-ఇల్లంతకుంట మూలలో రోడ్ సూచికకు అడ్డుగా ఫ్లెక్సీలు

### ఫ్లెక్సీలు తొలగించాలని ప్రజల డిమాండ్

**జమ్మికుంట, మార్చి 24 (ప్రజాతీర్పు)**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి--ఇల్లంతకుంట మూల వద్ద ఉన్న ఆర్ అండ్ బి రోడ్ సూచిక బోర్డు కనిపించకుండా దానికి అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారి సూచికలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బయట ప్రాంతాల నుంచి వచ్చే వారికి దారి తెలియక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించి, రోడ్ సూచిక బోర్డు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి ప్రజలు కోరుతున్నారు.




## జేఎన్‌టీయూహెచ్ రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ప్రారంభోత్సవం:

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 24 :**

వేములవాడ పరిధిలోని అగ్రహారం లిస్థానంరి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, రాజన్న సిరిసిల్ల. రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యార్థి సాంకేతిక సదస్సు - 2026ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ .బి. బాలు నాయక్ (జేఎన్‌టీయూహెచ్ అడ్మిషన్స్ డైరెక్టర్) గారు, ఇటువంటి సదస్సులు అభివృద్ధికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కొత్త ఆలోచనలను, సృజనాత్మకతను ప్రదర్శించే దిశగా ఆలోచించాలని ఆయన విద్యార్థులకు సలహా ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వేణుగోపాల్, హెచ్ఓడీ ఈసీఈ డాక్టర్ ధీరాజ్ సునెహెరా, రంజిత్ (ఎంఈ), భాస్కర్ (ఈఈఈ), రవికుమార్ (ఈసీఈ), శ్రవణ్ కుమార్ (సీఎస్ఈ), తిరుపతి ( సి.ఆర్.సి), మరియు ఉపాధ్యాయులు, బోధనేతర సిబంది మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. .



## నిద్రమత్తులో డ్రైవింగ్‌పై బీమారం పోలీసుల ప్రత్యేక చర్యలు--డ్రైవర్లకు అవగాహన,భద్రతకు ప్రాధాన్యం

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిరాల స్టాఫ్ రిపోర్టర్) మార్చ్ 24**

రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు,మంచిర్యాల జోన్ బీమారం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో రాత్రివేళల్లో నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో బీమారం పోలీసులు ప్రత్యేక చర్యలు,చేపట్టారు.రాత్రివేళల్లో పహారా నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లను గుర్తించి,వారికి తక్షణమే విశ్రాంతి కల్పించే చర్యలు తీసుకుంటున్నారు.డ్రైవర్లకు ముఖం కడగించి,టీ తాగించడంతో పాటు కొంతసమయం వారితో మాట్లాడి నిద్రమత్తు తగ్గేలా చేసి, అనంతరం మాత్రమే ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ,అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకూడదని, అవసరమైతే విరామం తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాదాలను,తగ్గించడం,ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధాన లక్ష్యంగా బీమారం ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి,రాత్రి సమయంలో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.



## భూ భారతి దరఖాస్తులు పరిష్కరించడంలో తహసిల్దార్లకు చిత్తశుద్ధి అవసరం

- రెవెన్యూ శాఖ అధికారులు పారదర్శక పాలన కోసం పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**

జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిష్కరించడానికి తాసిల్దారులకు చిత్తశుద్ధి అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుండి భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ జాబితా తయారీ, ఇతర రెవెన్యూ సమస్యలపై గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడంలో తహసిల్దారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత పాలన కోసం అధికారులందరూ పాటుపడాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలకు వెనకాడబోమని తహసీదార్లను ముక్తకంఠంతో హెచ్చరించారు. మండలాల వారీగా భూభారతి, ప్రజావాణి ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయో వాటన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. ఓటర్ జాబితా తయారీ అన్ని శాఖల సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సొంత నిర్ణయాలకు తావు లేదన్నారు. గూగుల్ మీట్లో ఆర్డీవోలు,తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ సంఘం మెదక్ జిల్లా(టాస్కా)

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**



అంతర్జాతీయ మహిళా దినోత్సవము తేదీ 24. 03. 2026 ఉదయం 11:00 గంటలకి మండల పరిషత్ కార్యాలయం మెదక్ లో సమావేశ మందిరము నందు టాస్కా జిల్లా అధ్యక్షులు శివ కృష్ణమూర్తి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమావేశం నిర్వహించబడినది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిని హేమ భార్గవి స్థానిక మండల పరిషత్ అధికారిని లక్ష్మీ విచ్చేసినారు. వీరితోపాటు టాస్కా రాష్ట్ర కార్యదర్శి టి. రాజేశ్వర్ మరియు టాస్కా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపర్తి వెంకటేశము వేదికను అలంకరించినారు. ముఖ్య అతిథి హేమ భార్గవి కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను న్యూక్లియర్ ఫ్యామిలీ గురించి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విశిష్టతలను తెలిపినారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో మహిళా శక్తిని బలోపేతం చేయాలని చెప్పారు. ప్రధాన నిర్ణయాల్లో మహిళా లను భాగస్వాములు చేయాలని అన్నారు ఈ సమావేశానికి మహిళలు సీనియర్ సిటిజన్స్ ప్రణామ్ డే కేర్ సిబ్బంది అంజలి సతీష్ మరియు శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు వేదిక పైనున్న మహిళాఅధికారులను మరియు సమావేశమునకు వచ్చిన మహిళలకు టాస్కా తరపున సన్మానం చేయడము జరిగినది. జిల్లా అద్యక్షులు శివ కృష్ణమూర్తి.



## మున్సిపల్ ట్రాక్టర్లు, ఆటోలు పరిశీలించిన చైర్మన్ సమిడ్ల వాణి శ్రీనివాస్

**(గుండేటి రాజు, ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 24.**

కొత్త బస్టాండ్ వాటర్ ట్యాంక్ దగ్గర మంగళవారం శానిటేషన్ వాహనములు ట్రాక్టర్లు, ఆటోలు పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తరచు వాహనములు మరమ్మతుకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయిల్ చేంజ్ సకాలంలో చేస్తూ మెయింటెనెన్స్ చేయాలని ఆదేశించారు. పట్టణ శానిటేషన్ లో వాహనములు చాలా కీలకమని 100% ఇంటింటి చెత్త సేకరించాలని ఆదేశించారు. ప్రస్తుతం రిపేర్ చేయవలసిన వాహనంలో సకాలంలో మరమ్మతులు చేయించి వినియోగం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట కౌన్సిలర్లు అరవ లక్ష్మి, జుంబర్తి గంగా లక్ష్మి రాజ్ కుమార్, చీటి లక్ష్మీనారాయణ, కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, దుమాల రాజ్ కుమార్, డి ఈ ఆనంద్, ఏ ఈ లక్ష్మి, అనిల్, సానిటరీ ఇన్స్పెక్టర్ లత, రాము మరియు అధికారులు ఉన్నారు.

## భారీ స్థాయిలో ఈడెన్ గార్డెన్ చర్చ్ ప్రారంభం

### స్వరూప్ విక్టరీ, అరుణ విక్టరీ ఆధ్వర్యంలో భారీ చర్చ్ ఓపెనింగ్

**మేడిపల్లి, మార్చ్ 24 (ప్రజాతీర్పు)**



మేడ్చల్ మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్, బోడుప్పల్, మేడిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు ఒక శుభవార్త. మేడిపల్లి ప్రధాన రహదారిపై డిమార్ట్ పై ఆరో అంతస్తులో సుమారు 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిన ఈడెన్ గార్డెన్ చర్చ్ శుక్రవారం నాడు ఘనంగా ప్రారంభం కానుంది.ఈ భారీ ప్రార్థనా మందిరాన్ని స్వరూప్ విక్టరీ మరియు అరుణ విక్టరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆధునిక సదుపాయాలతో, విశాల ప్రాంగణంతో నిర్మించిన ఈ చర్చ్ ప్రాంతీయ భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు అనుకూలంగా ఈ చర్చ్‌ను రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా సౌకర్యాలు కల్పించినట్లు వారు వెల్లడించారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, భక్తులు, సంఘ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆశీర్వచనాలు నిర్వహించబడతాయి ఈడెన్ గార్డెన్ చర్చ్ ప్రారంభంతో ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మెదక్‌లో వేసవి తాగునీటి సమస్యపై అలర్ట్

- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాలు

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**



కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ హాల్లో మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్, గ్రిడ్ ,ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్డబ్ల్యూఎస్ గ్రామపంచాయతీ, గ్రౌండ్ వాటర్, మున్సిపల్ కమిషనర్స్, వివిధ శాఖల అధికారులతో వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లాలో గ్రామాలలో ప్రజలకు త్రాగునీటి సమస్యను తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో జిల్లాలోని 917హ్యాబిటేషన్లలో నివసిస్తున్న 1,76,170 కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. . జిల్లాలో ఉన్న 1485 తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పకడ్బందీగా పర్యవేక్షణ జరగాలని సూచించారు. మౌలిక సదుపాయాలు: బోర్ వెల్స్ మరమ్మతులు, ట్యాంకుల క్లీనింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తిన వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట చేతిపంపులు, బోరు మోటార్లు, పైపైన్ మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా నిర్ణీత పరిమాణంలో నీరు సరఫరా అవుతోందో లేదో మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్ధారించుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ఈ వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల గ్రామాలను సందర్శించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మిషన్ భగీరథ ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్ సమిష్టిగా పని చేయాలన్నారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణులకు దప్పిక తీర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఎఫ్.ఓ జోజి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మిషన్ భగీరథ ఇంట్రా గ్రిడ్ ఈ..ఈ సంపత్ కుమార్, గ్రిడ్ నాగభూషణం, సంబంధిత మున్సిపల్ కమిషనర్స్, గ్రౌండ్ వాటర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చివరి మడి వరకు సాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు/గంగాధర, మార్చి 24 (ప్రజా తీర్పు ప్రతినిధి)**

చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని, చివరి మడి వరకు సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడుతామని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఈఎన్సీ రమేష్ బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఎల్లుండి గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించిన మంత్రికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

## సి ఎం రేవంత్ రెడ్డి ని ఎంఎంసీ భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, ఉప్పల్, మేడ్చల్ ) మార్చి 24 :-**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి వచ్చే వారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ (ఎంఎంసీ ) భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినమ్రంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప్పల్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.రామంతపూర్ ప్రాంతం లో కొత్త పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని 2009లో నిర్మించిన ఇందిరా గృహకాల్ప పథకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్లు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏ విభాగం పెట్టించుకోవటం లేదు అని ఆయన అన్నారు . ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాలనీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి స్థలం కేటాయించాలని కోరారు. పటేల్ కుంట అలాగే రామాం పూర్ చిన్న చెరువులను అభివృద్ధి చేయాలని ఆయన కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి...**

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 24.**

మార్చి 28న జగిత్యాల లో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం జిల్లా కోర్టు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి కోరారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ క్రిమినల్ కంపుండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు చిన్న చిన్న కేసులు సులభంగా పరిష్కరించు కోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులును న్యాయవాదులను కోర్టులో సంప్రదించాలని తెలిపారు. ఏ5 సమావేశంలో న్యాయమూర్తి నారాయణ, వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.



## సర్పంచ్ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం

**గడపల్లి, మార్చ్ 24 (ప్రజా తీర్పు)**

జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండల కేంద్రంలోని వెంగళాయిపేట గ్రామ సర్పంచ్ మోకెనపెల్లి గోపాల్ గారి ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంట వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమలత పాల్గొని ఆవులకు గేదెలకు గాలి కుంట వ్యాధి నివారణ టీకాలు వేసి రైతులకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది గ్రామ వార్డు సభ్యులు శ్రీరాం నర్సయ్య మాజి ప్రజా ప్రతినిధులు కదారి సుప్రియ-తిరుపతి కర్ణాకర్ రాజిరెడ్డి గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు

**పాపన్నపేట /మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**

పాపన్నపేట మండలం పోడ్చన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల 48 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇళ్లు నిర్మించుకోవాలనే ఉన్నవారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారికి ఆర్థిక సాయం చేస్తుందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. మిగిలిపోయిన వారికి కూడా త్వరలోనే మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేదల జీవితాల్లో చిరునవ్వు

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు
- నిరుపేదల కుటుంబాల పాలిట వరం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**పాపన్నపేట / మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**



పాపన్నపేట మండల మండలంలోని పొడిచన్ పల్లి గ్రామంలో 48 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాల మంజూరి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంజీరా గార్డెన్ లో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో పూరి గుడిసెలు ఉండకుండా చూడడమే లక్ష్యమన్నారు. పేదలకు, అర్హులందరికీ గౌరవప్రదంగా బ్రతకడానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో చిరునవ్వులు చూడాలన్నారు. విడుదలవారీగా ఎన్ని ఇండ్లు మంజూరు చేయడానికి అయినా సిద్ధమన్నారు. బిల్లులు సకాలంలో అందుతున్నాయి అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఒక 118 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. ఏప్రిల్ మాసంలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేస్తామని తెలిపారు. కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు నిరుపేదల పాలిట వరమని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్థిక స్తోమత లేకుండా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాల ఆడపిల్లలకు పెండ్లి సహాయ నిమిత్తం ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, హౌసింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, లబ్ధిదారులు ప్రజలు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణా పై ఉక్కుపాదం

- మెదక్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్
- సీజ్ చేసిన 60 టన్నుల ఇసుకను మెదక్ సాండ్ బజార్కు తరలింపు

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**

ఇసుక అక్రమ రవాణా పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీస్, రెవిన్యూ సంయుక్త ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించారు. మంగళవారం రోజున మెదక్ పసుపులేరు వాగు దగ్గర గంగమ్మ గుడి, ఎల్లమ్మ గుడి పరిసరాల ప్రాంతములో అక్రమ ఇసుక రవాణా చేసే దారిని గుర్తించి అట్టి దారిని జేసీబీ తో త్రవ్వి మరియు అక్రమంగా నిలువ చేసిన 60 టన్నుల ఇసుకని గుర్తించి అట్టి ఇసుకని తిప్పర్ల ద్వారా మెదక్ లో ఉన్న ఖుఅస బజార్ కు తరలించటం జరిగిందన్నారు.

మెదక్ తాసిల్దార్ కార్యాలయం రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ పోలీస్ యంత్రాంగం పాల్గొన్నారు.

## ఓల్డ్ నేరెడ్మెట్‌లో నకిలీ డెంటల్ డాక్టర్ గుట్టు రట్టు

**అనుమతులు లేకుండా డెంటల్ క్లినిక్ -- పోలీసుల ఆకస్మిక తనిఖీ**






**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్) మార్చి 24 :-**

ఓల్డ్ నేరెడ్మెట్ పరిధిలో నకిలీ డాక్టర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అనుమతులు లేకుండా డెంటల్ క్లినిక్ నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం మధ్యాహ్నం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, త్రీ టెంపుల్ సమీపంలోని సత్య ఆదిత్య టవర్స్‌లో ఉన్న "అంజాలిక డెంటల్ క్లినిక్"పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో గుప్తా రమేష్ కుమార్(46) ఎలాంటి గుర్తింపు పొందని( బి డి ఎస్) అర్హతలు లేకుండా దాదాపు 14 సంవత్సరాల నుండి క్లినిక్ నడుపుతూ, ఆధునిక వైద్యాన్ని అక్రమంగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనను డాక్టర్‌గా ప్రకటించుకుంటూ అమాయక రోగులను మోసం చేసి, వారి ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నేటెస్తూ సొమ్ము చేసుకుంటున్న నకిలీ డెంటల్ డాక్టర్ గుట్టు రట్టు చేసిన నేరెడ్మెట్ పోలిసిలు.



## జనగణన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

**మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**

జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. మంగళవారంవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికరులు ఉపగణాంక అధికారులతో అదనపు జనగణన అధికారి లతో కలిసి మండల ప్రణాళిక గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులకు జనగణన ప్రక్రియ, యాప్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ..ప్రభుత్వం అమలు చేయబోయే ప్రణాళికలలో భాగంగా సమర్ధవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని, ఈ తరుణంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, ఏప్రిల్ మొదటి వారం నుండి సన్నాహక పనులు జరుగుతాయని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మండల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్ / అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షకులు నేర్పించే అంశాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, శిక్షణలో పొందిన అవగాహనతో క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన తాగునీరందించేందుకే ఐజెల్ ప్లాంట్ ఏర్పాటు

**పాపన్నపేట /మెదక్, మార్చి 24 (ప్రజా తీర్పు ):**



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఉద్దేశంతో ఐజెల్ సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి ప్లాట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలం ఎల్లాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐజెల్ వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఉద్దేశంతో ఐజెల్ కంపెనీ వారు ముందుకు వచ్చి ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ప్రజలు స్వచ్ఛమైన నీటిని సేవించడం ద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెల్ సంస్థ నిర్వాహకులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**(వినోద్, ప్రజాతీర్పు, ఉప్పల్, మేడ్చల్) మార్చి 24**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్ లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.కుషాయిగూడలోని పోచమ్మ గుడి సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ డ్రైనేజ్ పనుల ద్వారా స్థానిక ప్రజలకు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం చక్రిపురం కాలనీలో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.టీచర్స్ కాలనీలో సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్ కాలనీ అధ్యక్షులు పాండు ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి అశోక్ గౌరవాధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి ఉపాధ్యక్షులు డిఎం కొండారెడ్డి సలహాదారులు సహదేవ్ గౌడ్ రణధీర్ రెడ్డి జి మురళి సంతోష్ గుప్తా జగన్మోహన్ రెడ్డి భాస్కర్ రెడ్డి యాకయ్య మధుసూదన్ రెడ్డి సంతోష్ గుప్తా రాజు ప్రకాష్ వెంకటేష్ గుప్తా మైపాల్ రెడ్డి తన్నీరు వెంకటేష్ బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఆలేటి మహిపాల్ రెడ్డి టీచర్స్ కాలనీ అధ్యక్షులు తిరుమల కృష్ణ గౌడ్ ప్రధాన కార్యదర్శి బురుగు నరసింహ కాలనీ ఫౌండర్ విజయ్ కుమార్ స్వామి లీగల్ అడ్వైజర్ నర్సింగ్ రావు శాశ్వత సలహాదారులు వేముల నరసింహ గౌడ్ సలహాదారులు నాయిని శేఖర్ రెడ్డి పో రెడ్డి శ్రీకాంత్ పడగంటి ఆంజనేయ చారి రాములు చారి ఉపాధ్యక్షులు మా ఊరి తిరుమల కమల లలిత నాయక్ జాయింట్ సెక్రెటరీ చిట్ల దర్శనం రామ్ రెడ్డి బాలకృష్ణ నరసింహ ముదిరాజ్ కాలనీవాసులు సత్తయ్య రాజు గుప్తా శ్యాంసుందర్ గౌడ్ అజయ్ బాబు మున్నా నాయక్ వెంకటకృష్ణ చౌదరి గూడూరు మహేష్ కుమార్ రాజు నాయక్ విద్యాసాగర్ పాస్టర్ ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, కోశాధికారి చిత్తుల కిషోర్ గౌడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాగుల వాసుదేవ ముదిరాజ్, సలహాదారుడు కొడకండ్ల యాదయ్య, వైస్ ప్రెసిడెంట్లు సల్ల వెంకటేష్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్. జాయింట్ సెక్రటరీ రాంగిరివార్ నర్సింగ్ రావు, కార్యదర్శి శీలం అనిల్ యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌కతా వైస్ కెప్టెన్‌గా రింకూ సింగ్.. కారణమిదే..!

**కోల్‌కతా వైస్ కెప్టెన్‌గా రింకూ సింగ్.. కారణమిదే..! భారత క్రికెటర్, పొట్టి వరల్డ్‌కప్ హీరో రింకూ సింగ్(=ఱఅఎబ నాఱఅస్త్రష్ట్ర)కు ప్రమోషన్ లభించింది. ఐపీఎల్‌లో సంచలన ఆటతో వెలుగులోకి వచ్చిన రింకూ వైస్ కెప్టెన్‌గా పదోన్నతి పొందాడు.**



భారత క్రికెటర్, పొట్టి వరల్డ్‌కప్ హీరో రింకూ సింగ్ కు ప్రమోషన్ లభించింది. ఐపీఎల్‌లో సంచలన ఆటతో వెలుగులోకి వచ్చిన రింకూ వైస్ కెప్టెన్‌గా పదోన్నతి పొందాడు. పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖశీశ్రీఎఖు ఖఱఅస్త్రష్ట్ర =ఱవతీం) కెప్టెన్ అజింక్యా రహానేకు ఈ సిక్సర్ల వీరుడు డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. ఫినిషర్‌గా రాణిస్తున్న ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు వైస్ కెప్టెన్సీ ఇస్తున్నట్టు మంగళవారం కోల్‌కతా ఫ్రాంచైజీ వెల్లడించింది. ఐపీఎల్‌కు గడువు సమీపిస్తున్న వేళ ఫ్రాంచైజీలు నైట్ ఈవెంట్లతో అభిమానులను అలరిస్తున్నాయి. నైట్స్ అన్‌ప్లగింగ్ పేరుతో కోల్‌కతా నైట్ రైడర్స్ మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కెప్టెన్ అజింక్యా రహానేకు డిప్యూటీగా రింకూ సింగ్ వ్యవహరిస్తారని ఫ్రాంచైజీ వెల్లడించాడు. ఫినిషర్ రింకూకు అదనపు బాధ్యతలు ఇవ్వడంపై హెడ్‌కోచ్ అభిషేక్ నాయర్ ఏమన్నాడంటే..? 'వైస్ కెప్టెకి రింకూ బాగా సరిపోతాడు. నేను కోల్‌కతా నైట్ రైడర్స్‌లో చేరినప్పుడు.. సహాయక సిబ్బందిగా ఉన్నప్పుడు నా తొలి జ్ఞాపకం రింకూ సింగ్‌తో పని చేయడం. ఇప్పుడు హెడ్‌కోచ్ అయ్యాను. ఏళ్లుగా రింకూ సింగ్ క్రికెటర్‌గానే కాదు నాయకుడిగానూ ఎదగడం మనం చూశాం. గత రెండు మూడు సీజన్లలో అతడి ప్రదర్శన అద్భుతం. ఫీల్డింగ్‌నూ అతడు చురుకుగా కదులుతాడు. మొత్తంగా జట్టు కోరుకునే వ్యక్తి అతడు. పవర్ హిట్టరైన అతడికి అదనపు బాధ్యతలు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని భావించాం. వరల్డ్‌కప్ ఛాంపియన్ కూడా అయిన రింకూకు వైస్ కెప్టెన్సీ ఇవ్వడానికి ఇదే సరైన సమయం. ఈ బాధ్యతను స్వీకరించి..జట్టును విజయబాటలో నడుపుతాడని ఆశిస్తున్నా' అని అభిషేక్ నాయర్ పేర్కొన్నాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో రింకూ సింగ్ పేరు మార్మోగిపోయింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్ యశ్ దయాల్ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా ఐదు సిక్సర్లతో కోల్‌కతాను ఒంటిచేత్తో గెలిపించాడు రింకూ. విధ్వంసక ఆటతో కోల్‌కతా బ్యాటింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగిన రింకూను 18వ సీజన్ కోసం రూ.13 కోట్లకు అట్టిపెట్టుకుంది. నిరుడు ఈ చిచ్చరపిడుగు 206 పరుగులు సాధించాడు.



## అనుష్కకు పిలుపు.. దక్షిణాఫికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపిక

**అనుష్కకు పిలుపు.. దక్షిణాఫికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపిక వచ్చే నెలలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళా క్రికెట్ జట్టులో యువ ఆల్‌రౌండర్ అనుష్క శర్మకు తొలిసారిగా చోటు దక్కింది.**

### రాణా, వైష్ణవిపై వేటు

వచ్చే నెలలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళా క్రికెట్ జట్టులో యువ ఆల్‌రౌండర్ అనుష్క శర్మకు తొలిసారిగా చోటు దక్కింది. కొద్దిరోజుల క్రితమే ముగిసిన డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ తరఫున రాణించిన 22 ఏండ్ల ఈ మధ్యప్రదేశ్ అమ్మాయితో పాటు పేసర్ కాశ్వీ గౌతమ్, వికెట్‌కీపర్ బ్యాటర్ ఉమా ఛెత్రి జట్టులోకి వచ్చారు. ఈ మేరకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ మంగళవారం వెల్లడించింది. స్నేహ్ రాణా, వైష్ణవి శర్మ, జి. కమిలిని, అమన్‌జోత్ కౌర్‌పై వేటు పడింది. వచ్చే నెల 17 నుంచి 27 మధ్య ఉమెన్ ఇన్ బ్లూ.. సఫారీలతో ఐదు టీ20లు ఆడనుంది. వచ్చే జూన్‌లో ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు ఇది సన్నాహకంగా ఉపయోగపడనుంది. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, షెఫాలీ, జెమీమా, దీప్తి, రిచా, అరుంధతి, రేణుకా, క్రాంతి, శ్రీచరణి, శ్రేయాంక, కాశ్వీ, ఫల్మలి, ఉమా, అనుష్క.



## ఆ సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు.. కీర్తిసురేష్ షాకింగ్ కామెంట్స్


నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది హీరోయిన్ కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యింది. అలనాటి హీరోయిన్ సావిత్రి జీవితకథగా వచ్చిన ఈ చిత్రంలో మహానటి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా నటించింది. నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది హీరోయిన్ కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యింది. అలనాటి హీరోయిన్ సావిత్రి జీవితకథగా వచ్చిన ఈ చిత్రంలో మహానటి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా నటించింది. తన నటనతో సావిత్రినే మరిపించి ఆడియన్స్ హృదయాల్లో మహానటిగా పేరు సంపాదించుకుంది. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి అగ్రకథానాయికగా వరుస హిట్లతో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది. ప్రస్తుతం తెలుగు , తమిళ్ తో పాటు హిందీలోనూ సినిమాలు చేస్తుంది ఈ వయ్యారి భామ. గతంలో కీర్తిసురేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన ఫిల్మ్ కెరియర్.. సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కీర్తి సురేష్. ఆమె మాట్లాడుతూ.. మహానటి చిత్రాన్ని ఓకే చేసినందుకు తనను కొందరు ట్రోల్ చేశారని.. ఆ సినిమా పూర్తయ్యాకే ఈ విషయం తనకు తెలిసిందని చెప్పుకొచ్చింది. తనపై వచ్చిన విమర్శలు పక్కనపెడితే సావిత్రమ్మ పాత్రలో నటించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు కీర్తి. "మహానటి చిత్రంలో నటించేందుకు ముందుగా ఒప్పుకోలేదు. సావిత్రమ్మ పాత్రలో నటించేందుకు చాలా భయమేసింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను ప్రోత్సహించారు. సోషల్ మీడియాలో నాపై వచ్చే నెగెటివిటీపై పెద్దగా ఆసక్తి చూపను. అందుకే నాపై ట్రోల్స్, విమర్శలు రావు. సావిత్రమ్మకు బయోపిక్ లో నటించడం భయంగా అనిపించింది. ఆమె కుమార్తెతో మాట్లాడి ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. ఎన్నో సవాళ్లు ఎదురైనా కూడా ఆ పాత్ర చేసినందుకు మాత్రం గర్వపడుతున్నాను" అంటూ చెప్పుకొచ్చారు కీర్తి సురేష్.



## ఈ వారం ఓటీటీలో 20కు పైగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ లు.. ఆ రెండూ చాలా స్పెషల్

ఎప్పటిలాగే ఈ వారం కూడా ఓటీటీలో పలు ఆసక్తికర సినిమాలు, వెబ్ సిరీస్ లు స్ట్రీమింగ్ కు రానున్నాయి. తెలుగుతో పాటు వివిధ భాషలకు చెందిన డబ్బింగ్ సినిమాలు, సిరీస్ లు అందుబాటులోకి రానున్నాయి. ఓవరాల్ గా సుమారు 20 కొత్త సినిమాలు ఈ వారం ఓటీటీలోకి రానుండడం విశేషం. ఈ వారం థియేటర్లలో పెద్దగా సినిమాలేవీ రిలీజ్ కావడం లేదు. వచ్చే వారం ఉగాది కానుకగా ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ 2 లాంటి సినిమాలు థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ఈ వారం బాక్సాఫీస్ ను వదిలేశారు. ఈ వారమే రిలీజ్ కావాల్సిన బ్యాండ్ మేళం కూడా వాయిదా పడింది. మరోవైపు ఓటీటీల్లో మాత్రం కొన్ని ఆసక్తికర సినిమాలు, వెబ్ సిరీస్ లు స్ట్రీమింగ్ కు రెడీ అయిపోయాయి. ఈ వారం ఓవరాల్ గా 20కు పైగా సినిమాలు ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తుండడం విశేషం. ఇందులో ప్రధానంగా రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విశ్వక్ సేన్ ఫంకీ, ప్రియాంక మోహన్ మేడిన్ కొరియా సినిమాలు కాస్త ఆసక్తిని కలిగిస్తున్నాయి. వీటితో పాటు ద తాజ్ స్టోరీ, జూటోపియా 2 వంటి ఇతర భాషల సినిమాలు కూడా ఓటీటీలో సందడి చేయనున్నాయి.

## సర్కార్-4 ఇక లేనట్లే!



గ్యాంగ్‌స్టర్ డ్రామా 'సర్కార్-4' చిత్రాన్ని ఏప్రిల్‌లో మొదలుపెడతానని ఇటీవలే ప్రకటించారు అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ. ఈ గ్యాంగ్‌స్టర్ ట్రయాలజీలో వచ్చిన మొదటి మూడుభాగాలు సంచలన విజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలందుకున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగో భాగంపై ఆసక్తి ఏర్పడింది. తాజాగా 'సర్కార్-4' ప్రాజెక్ట్‌ను రద్దు చేసుకుంటున్నట్లు రామ్‌గోపాల్‌వర్మ ప్రకటించారు. ఇటీవల విడుదలైన 'ధురంధర్-2' ప్రభావంతో తాను ఈ నిర్ణయాన్ని తీసుకున్నానని ఆయన తెలిపారు. ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌తో ముచ్చటించిన ఆర్జీవీ 'సర్కార్-4' గురించి మాట్లాడారు. "ధురంధర్' లాంటి సినిమా తర్వాత 'సర్కార్' తరహా చిత్రాలు ఏమాత్రం వర్కవుట్ కావనుకుంటున్నా. 'ధురంధర్' దర్శకుడు ఆదిత్యధర్ గురించి నేను ఎక్కువగా మాట్లాడుతున్నానని అందరూ అంటున్నారు. అందులో తప్పేముంది.

## మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి, ఆధ్యాత్మిక పురోగతికి మరో ముందడుగు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి, మేడ్చల్) మార్చి 24**



మంగళవారం మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ ప్రాంతంలో ఉన్న శ్రీ జయగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో ఇస్కాన్ (×ూఖజూచీ) సంస్థకు దేవాదాయ శాఖకు చెందిన భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న ఇస్కాన్ సంస్థ భగవద్గీత బోధన, యువతకు నాయకత్వ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా అన్నదానం, ప్రసాదం పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలను అందిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 500 నుండి 1500 చదరపు గజాల భూమిని కేటాయించి, శ్రీ కృష్ణ దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఆధ్యాత్మిక, నైతిక విద్యా కార్యక్రమాల కోసం అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అందుకుగాను మంత్రి వర్యులు సానుకూలంగా స్పందించారు, ఈ కార్యక్రమం ద్వారా మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడటంతో పాటు ప్రజలకు మేలుకలిగే అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.



## మహిళపై మత్తుమందు చల్లి పుస్తెలతాడు అపహరణ

**జమ్మికుంట, మార్చి 24 ప్రజాతీర్పు**

జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో పిండి గిర్నీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక మహిళపై గుర్తు తెలియని వ్యక్తి మత్తుమందు చల్లి, ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన సంఘటన మడిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కస్తూరి రమ, తన భర్త శ్రీనివాస్‌తో కలిసి నివాసముంటూ ఇంటి వద్దే పిండి గిర్నీ నడుపుతున్నారు. మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో రమ ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ఆ సమయంలో ముఖానికి కర్చీఫ్ కట్టుకున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి అక్కడికి వచ్చి, "పిండి పడతారా?" అని అడిగాడు. రమ పడతానని సమాధానం ఇచ్చే లోపే, సదరు వ్యక్తి ఒక్కసారిగా ఆమె ముఖంపై మత్తు స్ప్రే కొట్టడంతో రమ వెంటనే స్పృహ కోల్పోయి పడిపోయారు. ఇదే అదునుగా భావించిన నిందితుడు ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించి అక్కడి నుండి పరారయ్యాడు. అపహరణకు గురైన బంగారం విలువ సుమారు 60,000 రూపాయలు ఉంటుందని బాధితురాలు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రాజన్న సన్నిధి లో అత్యంత వైభవంగా శ్రీరామనవమి

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు ప్రతినిధి) మార్చి 24**



వేములవాడ మార్చ్ 24: తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుక్లపక్షం నవమి తిథిన జరుగు శ్రీరామనవమి పండుగను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న నిర్వహించనున్న సీతారాముల కళ్యాణం సందర్భంగా రాజన్న క్షేత్రానికి సుమారు మూడు నుంచి నాలుగు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మండుతున్న ఎండల నేపథ్యంలో తాగునీటి సదుపాయాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రసాదాల తయారీ కూడా సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తుల భద్రత కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేలా చూడాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు.

## రేపే ఐపీఎల్ కెప్టెన్లతో బీసీసీఐ భేటీ.. చర్చకు రానున్న కీలక అంశాలివే..!

క్రికెట్ అభిమానులకు వేసవి వినోదాన్ని పంచేందుకు ఐపీఎల్ సిద్ధమవుతోంది. పంతొమ్మిదో సీజన్‌కు మరో నాలుగు రోజులే ఉంది. టోర్నీ సమీపిస్తున్నందున పది జట్ల కెప్టెన్లతో భారత క్రికెట్ నియంత్రణ మండలి(దీజజ×) సమావేశం నిర్వహించనుంది. మార్చి 25(బుధవారం) ఐపీఎల్ కెప్టెన్లతో భేటీ సాయంత్రం 4 గంటలకు జరుగనుది. ఈ సందర్భంగా బీసీసీఐ, పది జట్ల సారథుల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020

# 14వ వర్ధంతి



బి.సి.జన బాంధవుడు

## కీ॥శే॥ సోయినేని శంకరయ్య గారు

వేములవాడ.

జననం 15-8-1947 మరణం : 25-3-2012

మంచికి మారుపేరుగా నిలిచి అందరి శ్రేయస్సుకు అహర్నిశలు పాటుపడి, అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న మీరు మానుండి దూరమై నేటికి 14 సంవత్సరాలు గడుస్తున్నా మీ జ్ఞాపకాలు మరువలేనివి. మీరు ఏ లోకములో వున్నా మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ...
మీరు చూపిన బాటలోనే నడుస్తూ....

**మీ కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు**

మీ ఆశయ సాధనలో...

తెలంగాణ బి.సి. యునైటెడ్ ఫ్రంట్
తెలంగాణ మున్నూరుకాపు
డెవలప్‌మెంట్ ఫోరం
హైదరాబాద్

సోయినేని శంకరయ్య మెమోరియల్ ట్రస్ట్
(రి.నెం. 217/2013)
ఇ.నెం. 7-6-12, ఓల్డ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్, వేములవాడ.
సెల్ : 9494659622, 9441749622

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020